RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 288 బుధవారం 12 నవంబర్ 2025 పేజీలు : 4 వెల : రూ. 2.00

### రద్దీ ప్రాంతాల్లో మాస్కు ధరించండి..

చెన్నై: రద్దీ ప్రాంతాలకు వెళ్లే ప్రజలు మాస్క్ ధరించాలని ఆరోగ్యశాఖ సూచించింది. వాతావరణ మార్పుల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా పగలు ఎండ తీవ్రత, రాత్రి వేళల్లో వర్షం కురుస్తోంది. ఈ కారణంగా చెన్నై సహా పలు జిల్లాల్లో వైరల్ జ్వరాల వ్యాప్తి అధికంగా ఉంది. నగరంలో కూడా జలుబు, దగ్గు, జ్వరం, ఒళ్లునొప్పులు తదితర లక్షణాలతో ఆస్పత్రుల్లో చేరేవారి సంఖ్య అధికమవుతోంది. ఈ క్రమంలో, ఆరోగ్య శాఖ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో... వాతావరణ మార్పుల కారణంగా వైరల్ జ్వరాలు వ్యాపిస్తున్నాయని, జ్వరాలు నిరోధించేలా ప్రజలు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించింది. వృద్ధులు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు రద్దీ ప్రాంతాలకు వెళ్లొద్దని, ఒకవేళ వెళ్లాల్సి వస్తే మాస్క్ ధరించాలని పేర్కొంది.

# ముగ్గురికీ ప్రతిష్ఠాత్మకమే..

## జూబ్లీహిల్స్‌లో ఏ పార్టీ గెలిచినా ప్రభావం తీవ్రం



హైదరాబాద్ : జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక ప్రతిష్ఠాత్మకంగా మారింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో ఖాళీ అయిన ఈ స్థానంకోసం పోటాపోటీ నెలకొన్నది. అటు అధికార పార్టీకి, ఇటు రెండు ప్రతిపక్ష పార్టీలకు జీవన్మరణ సమస్యగా మారింది. నవంబర్ 11న పోలింగ్ ముగిసింది. ఇదే నెల 14న భవితవ్యం తేలనున్నది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నవీన్‌యాదవ్, బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతా గోపీనాథ్, బీజేపీ అభ్యర్థిగా లంకల దీపక్‌రెడ్డి బరిలో నిలిచారు. ముక్కోణపు పోటీ అనిపించినా, ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నడుమ ద్విముఖ పోరుగా మారింది. ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగింది. కాంగ్రెస్ తరఫున సీఎం రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ తరఫున ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీజేపీ నుంచి బండి సంజయ్ ప్రతిష్టాత్మకంగా ప్రచారం నిర్వహించారు. పోటాపోటీ ఉపన్యాసాలతో జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రాంతాలు వారంరోజులపాటు దద్దరిల్లిపోయాయి. అభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్, ఆరు గ్యారెంటీల అమలులో సర్కారు వైఫల్యంపై బీఆర్ఎస్, హిందూత్వ ఎజెండాగా బీజేపీ తమ వైఖరులను ప్రదర్శించారు. ఈ దశలో జూబ్లీహిల్స్‌లో ఏ పార్టీ గెలుపొందినా ప్రభావం మాత్రం అధికంగా ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ఈ గెలుపోటములే పునాదిగా అన్ని పార్టీలు భావిస్తున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ఓటమి పాలైతే అధికారంలో మార్పులు చోటుచేసుకుంటాయని భావిస్తున్నారు. సీఎం రేవంత్ పాలనపై ప్రజల్లో విశ్వసనీయ కోల్పోయినట్టుగా భావించే ప్రమాదం ఉన్నది. కీలకమైన మార్పులు, చేర్పులకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పూనుకుంటుందని చెప్తున్నారు. కాంగ్రెస్ వైఫల్యాలు ఆ పార్టీని ఓడించాయని ప్రజలు కూడా భావించే అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలు, వచ్చే అసెంబ్లీ ఎన్నికలపై తీవ్ర ప్రభావం ఉంటుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి ఆ ఎన్నికల్లో తీవ్రమైన దెబ్బ ఉంటుందని భావిస్తున్నారు. కాంగ్రెస్ సర్కారులో కూడా రేవంత్‌రెడ్డి నాయకత్వంపై వ్యతిరేకత వచ్చే ప్రమాదం లేకపోలేదని చెప్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాభవంతో చతికిలపడిన బీఆర్ఎస్ పుంజుకోవాలంటే ఈ ఎన్నికే ప్రతిష్టాత్మకం కానున్నది. బీఆర్ఎస్ పార్టీ సిట్టింగ్ స్థానాన్ని కోల్పోతే ఆ పార్టీకి ఎదురు దెబ్బ తప్పదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అధికార పార్టీ ఎదుర్కోవడంలో, ఆ పార్టీ వైఫల్యాలను ప్రజల్లో తీసుకెళ్లినా నమ్మలేదని తేలుతుంది. వచ్చే ఎన్నికలపైనా ఆశలు వదులుకోవాల్సిందేనని చెప్తున్నారు. ప్రజలు అభివృద్ధినే నమ్ముకున్నారని తేలుతుంది. సానుభూతి కూడా పనిచేయలేదనే విషయం తేటతెల్లం కానున్నది. ప్రధాన ప్రతిపక్ష పాత్ర మారే అవకాశమూ లేకపోలేదు. బీజేపీ ఓటమి పాలైతే ప్రధానంగా హిందూత్వ ఎజెండా పనిచేయదని ఆ పార్టీకి బోధపడుతుంది. అదే విధంగా రాష్ట్రంలో బీజేపీకి భవిష్యత్తు ఆశలు ప్రశ్నార్థకం కానున్నాయి. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై ఇతర నేతలు వేలెత్తి చూపే అవకాశం ఉన్నది. వచ్చే ఎన్నికలపై బీజేపీ ఆశలు కూడా గల్లంతు కానున్నట్టు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.




## బిహార్‌లో ఎన్డీయేకే తిరిగి పట్టం..! ఎగ్జిట్ పోల్స్ అంచనాలివే!

బిహార్‌లో హొరాహోరీగా సాగిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. అధికార ఎన్డీయే, విపక్ష మహాగఠ్‌బంధన్ పార్టీల మధ్య తీవ్ర పోటీ కొనసాగింది. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయి పోలింగ్ నమోదైంది. నవంబర్ 14న ఫలితాలు వెల్లడి కానుండగా.. ఆయా సర్వేలు ఎగ్జిట్ పోల్స్ అంచనాలు ప్రకటిస్తున్నాయి. బిహార్‌లో అధికార ఎన్డీయే 133–159 స్థానాల్లో విజయం సాధిస్తుందని పీపుల్స్ పల్స్ అంచనా వేసింది. మహాగఠ్‌బంధన్‌కు 75–101 సీట్లు వచ్చే అవకాశం ఉందని తెలిపింది. ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జన్ సురాజ్ పార్టీకి 0–5 స్థానాలు, ఇతరులు 2–8 స్థానాల్లో విజయం సాధించవచ్చని అంచనా వేసింది. దైనిక్ భాస్కర్ ఎన్డీయేకు 145–160 సీట్లు, మహాగఠ్‌బంధన్‌కు 73–91 సీట్లు రావచ్చని అంచనా వేసింది. ఎన్డీయేకు 147–167, విపక్షాలకు 70–90 స్థానాలు ఇతరులకు 2–8 స్థానాలు వస్తాయని మ్యాట్రిజ్ అంచనా వేసింది. పీపుల్స్ ఇన్‌సైట్ కూడా ఎన్డీయేకు 133–148, విపక్షాలకు 87–102 సీట్లు, ఇతరులకు 3–6 వస్తాయని పేర్కొంది. జన్‌సురాజ్ పార్టీకి మాత్రం 0–2 స్థానాల్లో గెలుపొందే అవకాశం ఉందని తెలిపాయి.

## డాక్టర్ టెర్రర్.. 48 గంటల్లో చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో ఐదుగురి హస్తం..!

ఎర్రకోటకు అతి సమీపంలో కారులో సంభవించిన భారీ పేలుడుతో దేశ రాజధాని నగరం దిల్లీ ఉలిక్కిపడింది. ఈ పేలుడుకు కారణమైన ఐ20 కారుకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. ఆ కారు నడుపుతోన్న వ్యక్తి డాక్టర్ ఉమర్ నబీ అని పోలీసులు అనుమానిస్తున్నారు. గత రెండు రోజులుగా దేశవ్యాప్తంగా ఛేదిస్తోన్న ఉగ్ర కుట్రల్లో భాగమైన వారిలో ఏకంగా ఐదుగురు వైద్యులు ఉండటం సంచలనం సృష్టిస్తోంది. ఇప్పటివరకు దిల్లీ ఘటనను మంత్రులు, అధికారులు దీనిని ఉగ్ర ఘటనగా పేర్కొన్నప్పటికీ.. చట్టవిరుద్ధ కార్యకలాపాల కింద దర్యాప్తు చేస్తున్నారు. నిషేధిత జైషే మహ్మద్, అన్సార్ గజ్‌వత్ ఉల్ హింద్ ఉగ్ర సంస్థలతో సంబంధం ఉన్న 8 మందిని అరెస్టు చేసినట్లు సోమవారం జమ్మూకశ్మీర్ పోలీసులు వెల్లడించిన సంగతి తెలిసిందే.

వీరిలో ముగ్గురు వైద్యులు అదీల్ అహ్మద్, ముజమ్మిల్ షకీల్, షాహిన్ ఉన్నారు. వారిలోని మహిళా డాక్టర్ షాహిన్ సోమవారం లఖ్‌నవూలో అరెస్టు కాగా ఆమె కారు నుంచి ఏకే–47 రైఫిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. కశ్మీర్, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్, కేంద్ర ఏజెన్సీలు సంయుక్తంగా నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో అమ్మోనియం నైట్రేట్, పొటాషియం నైట్రేట్ సహా సల్ఫర్‌తో కూడిన 2,900 కిలోల పేలుడు పదార్థాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్లు జమ్మూకశ్మీర్ పోలీసులు తెలిపారు. మరోపక్క గుజరాత్‌లో భారీ ఉగ్ర కుట్రకు ప్రయత్నించిన సయ్యద్ అహ్మద్ మొహియుద్దీన్‌తో పాటు మరో ఇద్దరు ఐసిస్ సానుభూతిపరులను గుజరాత్ ఏటీఎస్ పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. సయ్యద్ అహ్మద్ మొహియుద్దీన్ కూడా ఒక డాక్టర్ కావడం గమనార్హం. ఈ పరిణామాల వేళ ఉమర్ ఆత్మాహుతి దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. తన సహచరుల అరెస్ట్, బాంబు తయారీలో వాడే పేలుడు పదార్థాల స్వాధీనంతో నిరాశ చెందిన అతడు ఈ




పేలుడుకు పాల్పడి ఉండొచ్చన్న కోణాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు.

**భారీ కూంబింగ్‌తో అప్రమత్తమై..!..** అదీల్.. జమ్మూకశ్మీర్‌లో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో పనిచేశాడు. ముజమ్మిల్ షకీల్, షాహిన్ ఒకేదగ్గర పనిచేసేవారు. ఆమెది లఖ్‌నవూ. గత మూడు సంవత్సరాలుగా అల్ ఫలాహ్ స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో ముజమ్మిల్ సీనియర్ రెసిడెంట్‌గా పనిచేస్తున్నాడు. అదే ఆసుపత్రిలో ఉమర్ కూడా పనిచేస్తున్నాడు. ఫరీదాబాద్‌లో పోలీసులు చేపట్టిన భారీ తనిఖీలు, తన సహచరుడు షకీల్ అరెస్ట్‌తో తీవ్ర ఆందోళనకు గురైనట్లు తెలుస్తోంది. ఈ తనిఖీలకు దాదాపు 800 మంది పోలీసులు వచ్చినట్లు సమాచారం. అయితే ఆ భయంతో ఉమర్ ఆత్మాహుతి దాడికి పాల్పడ్డాడా..? అనే కోణంలోనూ దర్యాప్తు జరుగుతోంది.

మరోవైపు ఉమర్ ఎంతకాలంగా అక్కడ పనిచేస్తున్నాడు.. ఇతరులతో అతడికి ఉన్న పరిచయాలపై ఫరీదాబాద్ పోలీసులు ఆరా తీస్తున్నారు. ఉమర్, ముజమ్మిల్ కదలికలను తెలుసుకునేందుకు సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. అమ్మోనియం నైట్రేట్‌తో పేలుడుకు పాల్పడేందుకు వారిద్దరూ కలిసి దిల్లీలో పర్యటించారా..? లేదా..? కోణంలో దర్యాప్తు జరుగుతోంది. జమ్మూకశ్మీర్ పోలీసులు ఉగ్ర కుట్ర ఛేధించిన తర్వాత నుంచి పరారీలో ఉన్న ఉమరే బాంబర్ కావొచ్చని అనుమానిస్తున్నారు. ఇక ఈ పేలుడుపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెల్లడించారు.





# అంతకు అంత!

## ప్రతీకారం తీర్చుంటాం..!

## చేతులకి గాజులు వేసుకుని కూర్చోలేదు రా..

### ఢిల్లీ పేలుడు ఘటనపై నిప్పులు చెరిగిన ప్రధాని మోదీ!!

ఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీ బాంబు పేలుడుతో దద్దరిల్లింది. రాష్ట్రపతి, ప్రధాని సహా ప్రముఖులెందరో ఉండే హైసెక్యూరిటీ జోన్‌లో జరిగిన ఈ ఘటనతో దేశం ఉలిక్కిపడింది. చారిత్రక ఎర్రకోట సమీపంలో సోమవారం సాయంత్రం ఓ కారులో జరిగిన భారీ పేలుడుతో 9మంది సామాన్యులు ప్రాణాలు కోల్పోయారు. మరో 24మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ఒక్కసారిగా జరిగిన విస్ఫోటంతో జనం ఎగిరిపడ్డారు. దేహాలు ఛిద్రమయ్యాయి. వాహనాలు తునాతునకలయ్యాయి. దుకాణాలు ధ్వంసమయ్యాయి. శకలాలతో క్షణాల్లోనే అది మరుభూమిగా మారింది. క్షతగాత్రుల హాహాకారాలు మిన్నంటాయి. ఉగ్రదాడిగా భావిస్తున్న ఈ పేలుడుతో దేశవ్యాప్తంగా హైఅలర్ట్ ప్రకటించారు. దేశవ్యాప్తంగా ప్రజలు సోషల్ మీడియాలో తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. 'ఇంత హై సెక్యూరిటీ జోన్‌లో ఇలాంటి బ్లాస్ట్ జరిగిందంటే ఇది సాధారణ విషయం కాదు. ఇది ఉగ్రదాడి తప్ప మరేమీ కాదు,' అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. 'ఇది దేశాన్ని అణగదీయాలనే శక్తుల దాడి. దీనికి తగిన సమాధానం ఇవ్వాలి,' అంటూ మరో వర్గం స్పష్టంగా చెబుతోంది. చేతులకి గాజులు వేసుకుని కూర్చోలేదు రా..అంతకు అంత రివేంజ్ తీర్చుంటాం అంటూ సోషల్ మీడియాలో ఘాటుగా కామెంట్స్ చేస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికే హోం మంత్రిత్వశాఖ అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించినట్లు సమాచారం. దాడి వెనుక ఉన్న వారిని ఏదైనా వదిలిపెట్టబోమని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. 'దేశ భద్రతతో ఆడుకునే వారిని కనికరం లేకుండా నాశనం చేస్తాం,' అని ఆయన ప్రకటించినట్లు కేంద్ర వర్గాలు చెబుతున్నాయి. సోషల్ మీడియాలో కూడా 'మోదీ యాక్షన్ తీసుకోవాలి', 'ఆపరేషన్ సింధూర్ టైప్‌లో మరో కౌంటర్ దాడి రావాలి', 'పాకిస్తాన్ మద్దతుతో జరిగిన కుట్ర ఇది' అంటూ హ్యాష్‌ట్యాగ్‌లు ట్రెండ్ అవుతున్నాయి. గతంలో జరిగిన 'బాలాకోట్ ఎయిర్ స్ట్రైక్స్' తర్వాత భారత్ ఎలా ప్రపంచానికి తన శక్తిని చూపిందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు కూడా ప్రజలు 'దానికి డబుల్ రేంజ్‌లో సమాధానం ఇవ్వాలి' అంటూ ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇదిలా ఉంటే, పేలుడు జరిగిన ప్రదేశాన్ని పూర్తిగా మూసివేసి, అక్కడి సీసీటీవీ ఫుటేజ్‌లు, వాహనాల రికార్డులు, మొబైల్ సిగ్నల్ ట్రాకింగ్ వంటి టెక్నికల్ డేటాను విశ్లేషిస్తున్నట్లు సమాచారం. అనుమానాస్పదంగా కనిపించిన కొన్ని వాహనాలను పోలీసులు ఇప్పటికే సీజ్ చేశారు. దేశ ప్రజలు ప్రస్తుతం ఒకే మాట చెబుతున్నారు ు 'ఇది దేశ గౌరవంపై దాడి. దీనికి తగిన ప్రతీకారం తప్పదు.'

**రాజ్‌నాథ్ సింగ్ వార్నింగ్..** ఢిల్లీలోని ఎర్రకోట పేలుళ్లకు పాల్పడినవారిని కఠినంగా శిక్షిస్తామని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వారిని విడిచిపెట్టం అంటూ రాజ్‌నాథ్ స్పష్టం చేశారు. దేశంలోని ప్రముఖ దర్యాప్తు సంస్థలు ఈ ఘటనపై వేగంగా సమగ్ర విచారణ జరుపుతున్నాయి. దర్యాప్తు వివరాలను త్వరలోనే ప్రజలకు వెల్లడిస్తాం.

పేలుళ్ల ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఆయన సానుభూతి తెలిపారు. దర్యాప్తు కొనసాగుతుందని.. ఈ నేపథ్యంలో ప్రజలు ప్రశాంతంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# సంపాదకీయం

## అమెరికాలో ఉద్యోగ సంక్షోభం తీవ్రం

అమెరికా ఉద్యోగ మార్కెట్ ప్రస్తుతం తీవ్రమైన సంక్షోభ దశలో ఉంది. 2003 తర్వాత అక్టోబర్ నెలలో తొలిసారిగా ఇంత భారీగా ఉద్యోగాలు కోల్పోయిన నెలగా 2025 అక్టోబర్ నిలిచింది. చాలెంజర్, గ్రే అండ్ క్రిస్మస్ సంస్థ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం, 2025 అక్టోబర్ లో సుమారు 1.5 లక్షల మంది ఉద్యోగులు తొలగించబడ్డారు. ఇది సెప్టెంబర్‌తో పోలిస్తే దాదాపు మూడు రెట్లు ఎక్కువ కావడం గమనార్హం. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు దాదాపు 10 లక్షల మంది అమెరికన్లు తమ ఉద్యోగాలను కోల్పోయారు.

**ప్రధానంగా ప్రభావితమైన రంగాలు...** టెక్నాలజీ, రిటైల్, సర్వీసులు, గిడ్డంగులు, మీడియా వంటి రంగాలు ఈ సంక్షోభంలో ఎక్కువగా దెబ్బతిన్నాయి. టెక్నాలజీ రంగం అత్యంత దెబ్బతిన్నది. అక్టోబర్‌లోనే 33, 000 మందికి పైగా ఉద్యోగులు తొలగించబడ్డారు.

గిడ్డంగుల రంగం: ఈ రంగంలో 48,000 మందికి పైగా ఉద్యోగాలు కోల్పోయాయి. లాభాపేక్షలేని సంస్థలు : ఇవి 27,000 మందికి పైగా ఉద్యోగులను తీసివేశాయి. మీడియా రంగం: ఈ ఏడాదిలోనే సుమారు 16,000 ఉద్యోగాలు కోల్పోయి తీవ్రంగా దెబ్బతింది.


**సంక్షోభానికి కారణాలు....** నిపుణుల విశ్లేషణ ప్రకారం, ఈ పరిస్థితికి అనేక అంశాలు కారణమవుతున్నాయి. కృత్రిమ మేధస్సు వినియోగం: కంపెనీలు ఆటోమేషన్ వైపు మళ్లి, ఖర్చులను తగ్గించుకునేందుకు సిబ్బందిని తగ్గిస్తున్నాయి. వ్యాపార వ్యయాలు అధికమవడం: నిర్వహణ ఖర్చులు పెరగడం. వినియోగదారుల ఖర్చులు తగ్గడం: మార్కెట్‌లో వస్తువుల కొనుగోలు శక్తి తగ్గడం.

**నియామకాలు కనిష్ట స్థాయికి...** ఒకవైపు తొలగింపులు రికార్డు స్థాయిలో ఉండగా, మరోవైపు ఉద్యోగ నియామకాలు గత 14 ఏళ్లలో కనిష్ట స్థాయికి చేరాయి. అంటే ఉద్యోగాలు కోల్పోయిన వారికి కొత్త అవకాశాలు దొరకడం మరింత కష్టంగా మారింది. నివేదిక విడుదల చేసిన సంస్థ ప్రతినిధి ఆండీ చాలెంజర్ మాట్లాడుతూ, "కంపెనీలు ప్రస్తుతం జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయి. కొత్త నియామకాలపై చాలా మెలకువగా ఉన్నారు" అని తెలిపారు.

**నిపుణుల హెచ్చరిక....** ఈ ధోరణి ఇలాగే కొనసాగితే, 2025లో మొత్తం తొలగింపులు పాండమిక్ కాలం నాటి స్థాయికి చేరే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థలో సాంకేతిక అభివృద్ధి పెరిగిన కొద్దీ, మానవ వనరులపై ఆధారపడే అవకాశాలు తగ్గుతున్నాయి. వేగంగా పెరుగుతున్న ఆటోమేషన్ కారణంగా, రాబోయే సంవత్సరాల్లో ఉద్యోగ మార్కెట్ పూర్తిగా మారిపోయే అవకాశం ఉందని, ఉద్యోగ భద్రత అమెరికా కార్మికులకు మరింత సవాలుగా మారుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ





శామీర్ పేట, నవంబర్ 11 (గరుడ వార్త) : శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద దమ్మాయిగూడ కు చెందిన నల్లగొండ శంకర్ గౌడ్, అనిల్ గౌడ్ దేవిక దంపతులు, తన్విక, తనిశ్విని అన్నదానం చేపట్టాగా శామీర్ పేట కు చెందిన యాస్కి శంకర్ గౌడ్- లలితా దంపతులు, వారి కుటుంబ సభ్యులు 80 కిలోల బియ్యం అందజేశారు. అలాగే శామీర్ పేట నల్సార్ కాలేజ్ కు చెందిన బొడ్డుపల్లి సీనయ్య - మమతా దంపతులు వారి కుటుంబ సభ్యులు అన్నదానానికి సహకరించారు. ఎల్లమ్మ తల్లి ఆలయానికి విచ్చేసే భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

## రైతు సేవ సహకార సంఘాన్ని సందర్శించిన వివిధ రాష్ట్రాల సహకార సంఘాల సీఈవోలు





శామీర్ పేట, నవంబర్ 11( గరుడ వార్త) : రైతు సేవ సహకార సంఘాన్ని వివిధ రాష్ట్రాల సహకార సంఘాల సీఈవోలు, సెక్రటరీలు సందర్శించారు. రైతు సేవా సహకార సంఘాన్ని నాబార్డ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ల పి ఎ సి ఎస్ సహకార సంఘాల సి ఈ ఓ లు, సెక్రటరీలకు శిక్షణా లో భాగంగా రెండవ రోజు శామీర్ పేట వ్యవసాయదారుల సేవా సహకార సంఘాన్ని మంగళ వారం సందర్శించారు. సంఘం చైర్మన్ రామిడి మధుకర్ రెడ్డి శామిర్ పేట సహకార సంఘం నుంచి రైతులకు అందుతున్న రుణాలు, ఎరువులు, విత్తనాలు, ఫార్మ్ రైస్ వన్ ప్రాజెక్టుతో మార్కెట్ లింకేజీ సౌకర్యం, డ్రోన్ల స్ప్రేయర్, అతి తక్కువ ధరలో టార్పాలిన్ల అమ్మకం, సి ఎస్ సి సెంటర్ ఆధ్వర్యంలో రైతులకు అందుతున్న ఆన్లైన్ సేవల గురించి వివరించారు. అనంతరం నాబార్డు ప్రతినిధులు మాట్లాడుతూ సంఘం అభివృద్ధి చూసి హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక , మహారాష్ట్ర పి ఎ సి ఎస్ సీఈఓ లు మాట్లాడుతూ తమ రాష్ట్రంలో తమ సంఘం చేస్తున్న అభివృద్ధి ని, వ్యాపారాల గురించి వివరించారు, శామిర్ పేట సంఘంలో జరుగుచున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి హర్షం వ్యక్తం చేసిన వారు ఈ సంఘాన్ని ఆదర్శంగా తీసుకొని ఈ కార్యక్రమాలను తమ సంఘంలో ప్రవేశ పెడతామన్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డు అధికారులు షీలా, సతీష్, యోగేష్, సంఘం డైరెక్టర్లు మ్యాకల ఐలయ్య, ముద్దం ప్రతాప్ రెడ్డి, లక్ష్మీ గారి నర్సింహులు, ఆకుల చంద్రకళ, సంఘ సీఈఓ, సిబ్బంది పాల్గొన్నారు.

## మల్లన్న ఆలయ అభివృద్ధి లక్ష్యంగా యాదవ సంఘం ప్రత్యేక సమావేశం



శామీర్ పేట, నవంబర్ 11( గరుడ వార్త ) : మల్లన్న దేవాలయ అభివృద్ధి లక్ష్యంగా యాదవ్ సంఘం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిం చారు. మంగళవారం శామీర్ పేట మండలంతూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని మల్లన్న దేవాలయ అభివృద్ధి కోసం యాదవ సంఘం ఆధ్వర్యంలో యాదవ సోదరులు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ ఎద్దు నాగేష్ యాదవ్, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్, మాజీ సర్పంచ్ దయాసాగర్ యాదవ్, యాదవ సోదరులు పాల్గొన్నారు.

## మరమ్మతులు.. కావాలి రూ.2.18 కోట్లు!



సిరిసిల్ల : జిల్లాలో ఈ ఏడాది కురిసిన వర్షాలకు పంచాయతీ రాజ్ పరిధిలోని రహదారులు పెద్దఎత్తున దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల గండ్లు పడగా, మరికొన్ని చోట్ల వంతెనలు కొట్టుకుపోయి తారులేచి గంతలమయంగా మారాయి. దీంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. లోలెవల్ కల్వర్టులపై నుంచి వాగులు పారడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.

**ఇదీ పరిస్థితి..** జిల్లాలో గ్రామీణ రహదారుల పరిధి ఎక్కువ విస్తరించి ఉంది. కొన్ని చోట్ల నిర్మాణ సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వాటి మనుగడ ప్రశ్నార్థంగా మారుతోంది. వర్షాలకు రహదారులపై నీరు నిలిచి.. వాహనాల రాకపోకలతో తరచూ దెబ్బతింటున్నాయి. అదే సిమెంటుతో వేసిన రహదారులతో పోలిస్తే తారు రహదారుల జీవితకాలం సగమే. తాత్కాలిక మరమ్మతులు చేసిన రహదారులు ఏడాది తిరగకుండానే పాడవుతుండగా.. మరికొన్ని రెండేళ్లలో దెబ్బతింటున్నాయి. కిలోమీటరు సిమెంటు రహదారికి నిర్మాణానికి రూ. 8 కోట్ల వరకు ఖర్చవుతుంది. ఇది సుమారు 25 ఏళ్ల వరకు మన్నికగా ఉంటుంది. అదే తారు రహదారికి రూ. 60 లక్షలు ఖర్చవుతుంది. వీటి జీవితకాలం పదేళ్లు మాత్రమే. అయితే అన్ని ప్రాంతాల్లో సిమెంటు రోడ్లు వేయాలంటే వ్యయంపరంగా అంత తేలికకాదు. కనీసం వరద వచ్చే ప్రాంతాల పరిధిలోలైనా వేస్తే.. కొంత వరకైనా మన్నికగా ఉంటాయి. రహదారుల మరమ్మతుల విషయమై పంచాయతీరాజ్ ఈఈ సుదర్శన్‌తో మాట్లాడగా.. రహదారుల తాత్కాలిక మరమ్మతులకు తాత్కాలిక అంచనాలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించామని తెలిపారు. వారి ఆదేశాల మేరకు చర్యలు చేపడతామని.. రాకపోకలకు ఇబ్బందిలేకుండా చూస్తామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 90 ప్రాంతాల్లో 80 కిలోమీటర్లకు పైన రహదారులు, వాగులు, వంకలపై ఉన్న కల్వర్టులు వర్షాలకు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. వీటిని తాత్కాలిక మరమ్మతులకు రూ. 2.18 కోట్ల నిధులు అవసరం ఉండగా.. పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసేందుకు రూ. 108 కోట్లు అవసరమని అంచనా. ముస్తాబాద్ మండలం రామలక్ష్మణపల్లి వారు సిరిసిల్లకు రావాలంటే ఎల్లారెడ్డిపేట మండలం పదిర మానేరువాగు దాటాలి. ఎగువమానేరు అలుగు పారినన్ని రోజులు వాగు ప్రవహిస్తూనే ఉంటుంది. ఈ గ్రామానికి రాకపోకలకు ఇబ్బందులు తప్పవు. అత్యవసరమైతే అవునూరు, వెంకటాపూర్ మీదుగా పది కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి. ఇక్కడున్న లోలెవల్ వంతెన పంచాయతీరాజ్ పరిధిలో ఉంది. దీనిని మూడేళ్ల క్రితం ఆర్అండ్‌బీకి అప్పగించారు. శాఖలు మారడంతో హైలెవల్ పంపడంలో జాప్యం జరుగుతోంది.

## ఖాళీ స్థలాలు.. వ్యాధులకు కారకాలు

గోదావరిఖని : నగరంలోని వివిధ కాలనీల్లోని ఖాళీ ప్రదేశాలు(ప్లాట్లు) వ్యాధులకు కారకాలుగా మారుతున్నాయి. వర్షాకాలంలో ఆయా ప్రదేశాల్లో వరద, మురుగునీరు నిలవడం, దోమలు, పందులకు ఆవాసంగా మారడం, పరిసరాల్లో నివసించేవారికి దుర్గంధంతో పాటు వ్యాధులు వ్యాపిస్తున్నాయి. ఖాళీ ప్రదేశాల్లో వరద, మురుగునీరు, చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రంగా ఉంచాలని.. లేకపోతే నగరపాలిక ఆధ్వర్యంలో శుభ్రం చేయించి జరిమానా విధిస్తామని పేర్కొనడంతో కొందరు యజమానులు మాత్రమే స్పందించి ఆయా స్థలాలను శుభ్రం చేయించారు. నగరపాలిక నిబంధనల ప్రకారంగా జరిమానాలు విధించేందుకు రంగం సిద్ధం చేసినప్పటికీ వివిధ కారణాలతో ఆచరణకు నోచుకోలేదు.

నగరంలోని కాకతీయనగర్, మార్కండేయకాలనీ, శాంతినగర్, శ్రీనగర్ కాలనీ, ఇందిరానగర్, శివనగర్, రాజ్యలక్ష్మి తదితర కాలనీల్లో ఖాళీ ప్రదేశాల్లో మురుగు, వరద, చెత్తాచెదారం సమస్య తీవ్రంగా ఉంది. నివాసాల మధ్య ఖాళీ ప్లాట్లలో మురుగునీరు నిలుస్తుండటంతో దానికి ఇరువైపులా ఇళ్లలోని వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బహుళ అంతస్తుల భవనాలున్న కాలనీల్లోనే సమస్య తీవ్రంగా ఉంది. స్థలం ఖాళీగా ఉండటంతో సమీపంలోని వారు చెత్తను అందులోనే



పడేస్తుండటంతో కొన్ని కాలనీల్లో ఖాళీ ప్రదేశాలు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. స్థలాల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను సేకరించి నోటీసులు జారీ చేస్తామని గతంలో నగరపాలక అధికారులు పేర్కొన్నా ఆచరణకు నోచుకోవడం లేదు. స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న స్థలాల్లోనూ మురుగు, చెత్త సమస్య లేకుండా శ్రద్ధ వహిస్తే అధిక శాతం సమస్య పరిష్కారం కానుంది. అధిక రేటు వస్తే విక్రయిద్దామని, వీలున్నప్పుడు ఇల్లు కట్టుకుంటామని ప్లాట్ల యజమానులు నిశ్చింతంగా ఉండగా, వాటి పక్కన ఇళ్లు కట్టుకొని నివసించే వారు రోగాల బారిన పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. నగరపాలక అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి యుద్ధ ప్రాతిపదికన ఖాళీ ప్రదేశాల్లో పేరుకుపోయిన మురుగు, వరద, చెత్త సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీ వాసులు కోరుతున్నారు.

## అత్యవసర సేవ.. కమీషన్ల తోవ

నల్గొండ: అర్ధరాత్రి పాముకాటు వేస్తేనో.. క్షణికావేశానికిలోనై పురుగుమందు తాగిన కేసులుంటేనో..రోడ్డు ప్రమాదాలు.. తీవ్రమైన కడుపునొప్పితో బాధపడే రోగులు ప్రభుత్వ ఆసుపత్రిలోని అత్యవసర వైద్యవిభాగానికి హడావుడిగా వస్తుంటారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా క్రిటికల్ కేర్, వైద్యులను ప్రభుత్వం ఏర్పాటు చేసినా..ఇలాంటి కేసులను వైద్యులు 'చూసీచూడనట్లు' వదిలేసి వెంటనే హైదరాబాద్, జిల్లాలోని ప్రముఖ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రికో తీసుకెళ్లాలని చేతులెత్తేస్తున్నారు. వెంటనే బాధితుల బంధువుల ఆందోళనలు, అవసరాన్ని చూసి అక్కడున్న ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్లు రంగప్రవేశం చేస్తారు. మీరు వాహనంలో ఎక్కండి.. నాకు తెలిసిన మంచి ఆసుపత్రి ఉందంటూ 'కమీషన్' ఇచ్చే వైద్యుడి వద్దకు తీసుకెళ్తారు. ఇలా రోజూ రెండు మూడు కేసులను తమకు తెలిసిన ఆసుపత్రులకు తీసుకెళ్లడం.. రోగుల నుంచి ముక్కుపిండి వసూలు చేయడం పరిపాటిగా మారాయి.

నల్గొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాసుపత్రులకు ఎదురుగానే ఒక్కో ఆస్పత్రి వద్ద గరిష్ఠంగా 15 వరకు ప్రైవేట్ అంబులెన్స్‌లు తిష్ఠవేస్తున్నాయి. ఆపదతో వచ్చే రోగుల అత్యవసరాలను ఆసరా చేసుకుని ప్రైవేట్ ఆస్పత్రులు ఇచ్చే కమీషన్ల కక్కుర్తితో ఇలా నిలువుదోపిడీకి పాల్పడుతున్నారు.

మూడు జిల్లాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద రెండేసి చొప్పున ప్రభుత్వ అంబులెన్స్‌లు ఉన్నా.. ప్రభుత్వం అవుట్ సోర్సింగ్ డ్రైవర్లను ఏర్పాటు చేసుకుంది. వారికి నెలకు సరిపడా వేతనాలు, డీజిల్‌కు డబ్బులు ఇవ్వడం లేదు. పైగా ఈరెండు వాహనాలు పాతవి కావడంతో తరచూ



మరమ్మతులకు గురవుతున్నాయి.

కొన్నిచోట్ల ప్రభుత్వ అంబులెన్స్ డ్రైవర్లను భయభ్రాంతులకు గురిచేసో, మభ్యపెట్టో తమ వాహనంలోకి రోగులను ఎక్కించుకుని తమకు కమీషన్ ఇచ్చే ఆసుపత్రికి తీసుకెళ్లి అప్పటికప్పుడే డబ్బులు దండుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాసుపత్రుల ఎదుట నిలిపి ఉంచే ఈ ప్రైవేట్ అంబులెన్స్‌లు నెలకు ఎలాంటి కిరాయిలు చెల్లించడం లేదు. ఎవరైనా ఆటోలు, ఇతర వాహనాల్లో వస్తే వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నల్గొండ జిల్లాసుపత్రిలో రెండు అంబులెన్సులుండగా ఒకటి తరచూ మరమ్మతులకు గురవుతుందని.. మరొకదాన్ని రిఫరల్ సర్వీసులకు ఉపయోగిస్తున్నామని జిల్లా ఆసుపత్రుల పర్యవేక్షకురాలు డా. అరుణ కుమారితో తెలిపారు. తెల్లరేషన్‌కార్డు వారికి ఉచితమని.. మిగతా వారు డబ్బులు చెల్లించాలని పేర్కొన్నారు. గతంలో ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చామని.. ఆర్థిక దోపిడీ చేయవద్దని సూచించామన్నారు. ఎవరైనా వీరి ఆగడాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# పుస్తకమే నేస్తం.. పఠనమే వ్యాపకం

కరీంనగర్: నేటి ఉరుకుల పరుగుల జీవనంలో చాలా మంది పుస్తక పఠనం మరిచారు. మొబైల్ ఫోన్‌లు, సామాజిక మాధ్యమాల్లో అనవసర, నిజం లేని విషయాలపై సమయం వృథా చేసుకుంటున్నారు. కొందరికి పుస్తకాలు చదవాలనే ఆసక్తి ఉన్నా సమయం కేటాయించలేకపోతున్నారు. అయితే ఇప్పటికీ కొందరు పుస్తక ప్రియులు ఎక్కడ ప్రదర్శనలు జరిగినా.. బుక్ డిపోలు కనిపించినా నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేస్తుంటారు. ఇలా ఆసక్తి కలిగిన నగరానికి చెందిన ముగ్గురు వ్యక్తులు వారి ఇళ్లను పుస్తకాలతో నింపేసి గ్రంథాలయాలుగా మార్చేసుకున్నారు. పుస్తక ప్రపంచంలో జీవిస్తూ విజ్ఞానాన్ని పోగేసుకుంటూ వారి మనోభావాలతో పంచుకున్నారు.

**పాఠశాల రోజుల నుంచే ఆసక్తి**

నా చిన్నతనం నుంచి పుస్తక పఠనమంటే ఇష్టం. ఇంటర్, డిగ్రీ చదివే రోజుల్లో నిత్యం 25 పైసలు వెచ్చించి నవలలు తెచ్చుకొని చదివేవాన్ని. 1975లో బీఎస్‌ఎన్‌ఎల్‌లో చేరిన తరువాత పుస్తకాల కొనుగోలు ప్రారంభించా. ఆ సమయంలో ఏదో ఒక పుస్తకం కొని చదివేవాన్ని. హైదరాబాద్‌కు వెళ్తే పుస్తక ప్రదర్శనలు, బుక్ స్టాళ్లలో ఆధ్యాత్మిక, కథా సాహిత్యం పుస్తకాలు కొనేవాన్ని. 1980–2000 వరకు ఉన్న ప్రముఖ నవలా రచయితల పుస్తకాలను ఇప్పటికీ భద్రపర్చా. వార పత్రికల్లో వచ్చే మంచి కథలను సేకరించి ఒక బుక్ బైండింగ్ చేయించా. ఇండియా టుడే, ఈనాడు దిన పత్రికల్లో ఆసక్తికర అంశాలను సేకరించా. లోక్‌సత్తా కార్యాలయానికి, ఆధ్యాత్మిక ఇస్కాన్ వారి గీతామందిరానికి భగవద్గీతలను, మరి కొన్ని నవలలను గ్రంథాలయాలకు ఇచ్చా. ప్రతి నిత్యం ఉదయం దినపత్రిక మొత్తం చదువుతా. దినపత్రికలోని ఆదివారం సంచికలో పదకోశం నింపనిదే ఆ రోజు మనసున పట్టదు.

**వరాల మహేష్, విశ్రాంత ఉద్యోగి, బీఎస్‌ఎన్‌ఎల్**

సినారె సాహిత్యంపై మమకారం

నా చిన్నతనంలో మా బావలు, అక్కలు పుస్తకాలను అద్దెకు తెచ్చుకొని చదివేవారు. ఆ తరువాత వాటిని అప్పజెప్పేందుకు నన్నే పంపేవారు. అలా ఆ పుస్తకాలను చదవడం మొదలెట్టా. ముఖ్యంగా సినారె సాహిత్యం, పాటలు వినడం, చదవడంతో సాహిత్యంపై మమకారం పెరిగింది. చరిత్ర, సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలంటే నాకు చాలా ఇష్టం. అంబేడ్కర్, అబ్దుల్‌కలాంలాంటి మహనీయుల పుస్తకాలు, వేదాలు, బైబిల్, ఖురాన్, భగవద్గీతలను కొనుగోలు చేసి చదివా. మా ఇంట్లో గ్రూప్, ఐఏఎస్ పోటీ పరీక్షల పుస్తకాలన్నీ ఉంటాయి. పీహెచ్‌డీ, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేవారు మా ఇంట్లో ఉండి చదువుకోవచ్చు. తెలుగులో డాక్టరేట్ సాధించి డిగ్రీ అధ్యాపకుడిగా స్థిరపడాలనే లక్ష్యంతో ఉన్నా. రోజూ సాయంత్రం పుస్తకాలు చదువుతా. నా పిల్లలతో కూడా మహనీయుల జీవిత చరిత్రలను చదివిస్తా. ఆదిశంకరాచార్యుల బోధనలు, ఉపనిషత్తులు చదివి అవి విద్యార్థులకు ఏ విధంగా ఉపయోగపడతాయో సూచిస్తూ పుస్తకం రాస్తున్నా. భవిష్యత్తులో నా ఇంటిని గ్రంథాలయంగా తీర్చిదిద్దుతా.

దొమ్మటి శంకరప్రసాద్, ప్రైవేటు ఉపాధ్యాయుడు, కరీంనగర్

**మిత్రుల సాంగత్యంతో..**

సాహితీ మిత్రుల సాంగత్యమే పుస్తక పఠనం, సాహితీ రచనలకు స్ఫూర్తినిచ్చింది. 1990 కన్నా ముందు నుంచి జగిత్యాలలో అలిశెట్టి ప్రభాకర్ నేను మిత్రులం. ఆయన కవితలు చదివి నేను కూడా చిన్న చిన్న చిన్న కవితలు రాయడం ప్రారంభించా. 1993లో కరీంనగరకు వచ్చాక ఇక్కడి సాహితీ సమావేశాల వాతావరణం నన్ను పూర్తిగా మార్చేసింది. సాహిత్యాభిరుచితోపాటు వివిధ సాహితీ ప్రక్రియలకు సంబంధించి పుస్తకాలు కొనుగోలు చేయడం ప్రారంభించా. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేయడంతో విస్తృత సాహితీ, ఉద్యమ సమావేశాల్లో పాల్గొనడానికి అవకాశం కలిగింది. ఇంట్లో పెట్టుకునేందుకు కష్టంగా ఉందని కొన్ని పుస్తకాలను వేములవాడ గ్రంథాలయానికి, దాదాపు 400 వరకు కొందరు పిల్లలకు వితరణ చేశా. గాజోజు నాగభూషణం, విశ్రాంత ఉపాధ్యాయుడు

# కాసుల స్కానింగ్

దేవరకొండ : జిల్లాలో స్కానింగ్ కేంద్రాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. అనుమతులు లేకుండానే నిర్వాహకులు యథేచ్ఛగా వీటిని నిర్వహిస్తున్నారు. నిబంధనలు తుంగలో తొక్కి లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. ఉమ్మడి జిల్లాల్లో కొన్ని స్కానింగ్ సెంటర్లలో పుట్టబోయే బిడ్డ ఎవరని పరీక్షలు చేస్తూ.. ఆడశిశువును పిండస్థ దశలోనే చంపేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిరంతరం తనిఖీ చేసి చర్యలు తీసుకోవాల్సిన జిల్లా శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అనుమతుల మంజూరులోనూ చేతివాటం ప్రదర్శిస్తున్నారు.

నల్గొండ జిల్లాలో 134 స్కానింగ్ సెంటర్లు ఉండగా.. 95 నిర్వహణలో ఉన్నాయి. కొత్తగా సెంటర్ల ఏర్పాటుకు, ఉన్నవి పునరుద్ధరించేందుకు పలువురు జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి కార్యాలయానికి వస్తుంటారు. కొందరు సిబ్బంది ముడుపులు తీసుకొని అనుమతులకు 'సై' అంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న సిటీ స్కానింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భ్రూణహత్యల నియంత్రణకు కేంద్రం 1994లో చట్టాన్ని రూపొందించింది.. 2005లో సమగ్ర సవరణలతో లింగ నిషేధ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఈ చట్టాల్ని అనుసరించి అన్ని జన్యు సంబంధిత పరీక్షలు నిర్వహించే సంస్థలు, వైద్యులు తమ వివరాలను డీఎంహెచ్‌వో




వద్ద తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంది. కానీ ఉమ్మడి జిల్లాలో ఇలాంటి నిబంధనలను ఎవరూ పాటించడం లేదు. దేవరకొండ, మిర్యాలగూడ డివిజన్ లాంటి ప్రాంతాల్లో విచ్చలవిడిగా సిటీ స్కాన్ సెంటర్లు నడుపుతున్నారు.

ఇటీవల కడుపునొప్పితో ఓ బాలుడు దేవరకొండ పట్టణంలోని స్కానింగ్ సెంటర్ వస్తే.. అత్యవసరంగా తమ పరిధిలో ఉండే పేరుమోసిన ప్రైవేట్ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయాలని హడావుడి చేశారు. బాలుడి తండ్రి అప్రమత్తమై హైదరాబాద్‌కు తీసుకెళ్తే ఫుడ్‌పాయిజన్‌గా గుర్తించి మందులతో తగ్గుతుందని పంపించారు. దీంతో ఆ తండ్రి స్కానింగ్ సెంటర్ నిర్వాహకుడితో వాగ్వాదానికి దిగారు.

అనుమతి తప్పనిసరి: శ్రీనివాస్, డీఎంహెచ్‌వో

స్కానింగ్ సెంటర్లు, ప్రైవేట్ క్లినిక్‌లు ఏర్పాటు చేయాలనుకుంటే తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి. అనుమతి లేని వాటిని గుర్తించి చర్యలు తీసుకుంటాం.

# రక్తం పోటెత్తుతోంది



జగిత్యాల : జిల్లాలో అసాంక్రమిక వ్యాధిగ్రస్థుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. రక్తపోటు, మధుమేహంతో పాటు క్యాన్సర్ మహమ్మారి చాప కింద నీరులా విస్తరిస్తోంది. ఆహార అలవాట్లు, ఊబకాయం, వ్యాయామం లేకపోవడంతో చిన్న వయసులోనే వ్యాధులు చుట్టుముడుతున్నాయి. ప్రభుత్వం 2018 నుంచి నిర్వహిస్తున్న అసాంక్రమిక వ్యాధుల నిర్ధారణ సర్వేలో ఈ విషయం వెల్లడైంది.

**30 ఏళ్లు దాటిన వారితో నిర్వహణ**

ఎన్‌సీడీ(నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్) కార్యక్రమంలో భాగంగా 30 ఏళ్లు దాటిన వారితో ఏటా వైద్య శాఖ సర్వే నిర్వహిస్తోంది.

జిల్లాలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు 5,99,416 మందిని సర్వే చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా 5,74,382(95.87) మందిని చేశారు. సర్వేలో 96,965(16.2 శాతం) మందికి రక్తపోటు నిర్ధారించగా 41,962 మందికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో, 55,003 మందికి ప్రైవేటులో చికిత్స నిర్వహించారు.

44,142 మందికి మధుమేహం నిర్ధారణ కాగా ప్రభుత్వ ఆసుపత్రిలో 18,154 మంది, ప్రైవేటులో 25,988 మంది చికిత్స తీసుకున్నారు.

**861 మందికి క్యాన్సర్**

జిల్లాలో క్యాన్సర్ వ్యాధిగ్రస్థులు ఏటేటా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ఎన్‌సీడీ సర్వేలో 276 రొమ్ము, 125 గర్భాశయ, 202 ఓరల్, 258 ఇతర రకాలు కలిపి మొత్తం 861 మంది క్యాన్సర్ వ్యాధిగ్రస్థులున్నట్లు తేల్చారు. ఇంకా తమ దృష్టికి రాని బాధితులు అత్యధిక సంఖ్యలో చికిత్స పొందుతున్నట్లు వైద్యశాఖకు సమాచారం ఉంది.

**10 పడకలతో ప్రత్యేక విభాగం**

క్యాన్సర్ రోగులకు కీమోథెరపీ ప్రధానం. చాలా మంది బాధితులు ఇందుకోసం ఇతర ప్రాంతాలకు వెళ్తూ వ్యయప్రయాసలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లా ఆసుపత్రుల్లో గత నెలలో కీమోథెరపీ సౌకర్యం కల్పించింది. జగిత్యాల ఆసుపత్రిలో 10 పడకల సౌకర్యంతో కీమోతోపాటు క్యాన్సర్ రోగులకు మందులు అందుబాటులో ఉంచారు. నర్సులకు హైదరాబాద్‌లో ఇటీవల శిక్షణ కూడా ఇచ్చారు. కొన్ని రకాల క్యాన్సర్ రోగులకు వైద్యులు రాసిచ్చిన మందులు సైతం అవసరమైతే కొనుగోలు చేసి స్థానికంగానే అందించేలా ఏర్పాటు చేశారు.

**ఆరు నెలలకోసారి పరీక్షలు తప్పనిసరి**

జీవనశైలిలో మార్పులతోనే అసాంక్రమిక వ్యాధుల నియంత్రణ సాధ్యం. నిత్యం వ్యాయామం అలవాటు చేసుకోవడంతో పాటు ధూమపానం, పొగాకు, గుట్కా, అలవాట్లకు దూరంగా ఉండాలి. ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి. సమతుల ఆహారం తీసుకోవాలి. ప్రతి ఆరు నెలలకోసారి తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించాలి. ప్రతి ఆరోగ్య మహిళా శిబిరంలో ఉచిత పరీక్షల అవకాశాన్ని వినియోగించుకోవాలి.

డాక్టర్ ప్రమోద్‌కుమార్, జిల్లా వైద్యాధికారి

సర్వే నిర్వహించిన వారి సంఖ్య: 5,74,382
క్యాన్సర్ నిర్ధారణ: 861
రక్తపోటు బాధితులు: 96,965
మధుమేహ వ్యాధిగ్రస్థులు: 44,142

# కాకి లెక్కలు.. కాగితాల్లో మొక్కలు



సారంగాపూర్ : గత ప్రభుత్వ హయాంలో హరితహారం, ప్రస్తుత సర్కారు వనమహోత్సవం పేరిట ఏటా మొక్కలు నాటుతున్నా సంరక్షణలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది. పదేళ్లుగా జిల్లాలోని 385 పంచాయతీల పరిధిలో వివిధ శాఖల ఆధ్వర్యంలో 8.25 కోట్ల మొక్కలు నాటినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఇందులో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా గతేడాది వరకు 2,50,51,271( 2.5 కోట్లు) నాటగా ఈ ఏడాది మరో 23,43,485 మొక్కలు నాటేందుకు లక్ష్యం నిర్దేశించారు. ఒక మొక్కకు కనీసం రూ.150 వరకు చొప్పున పదేళ్లలో రూ.375,76,90,650(రూ.375 కోట్లు) వెచ్చించగా ఈ ఏడాది రూ.4,87,07,417 ఖర్చు చేశారు. ఇంత పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తున్నా అక్కడక్కడ రహదారి వెంట తప్ప ఎక్కడా మొక్కలు కనిపించడం లేదు.

**ఖర్చు చేస్తున్నారిలా..**

ఉపాధిహామీ పథకం కింద గ్రామానికో నర్సరీ ఏర్పాటు చేసి ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా మొక్కల పెంపకం చేపడుతున్నారు.

కవర్లలో మట్టి నింపి, విత్తనం నాటినందుకు మొక్కకు రూ.1.50 చెల్లిస్తున్నారు. సంరక్షకుడికి రోజుకు రూ.307 చొప్పున నెలలో 24 రోజుల చొప్పున 8 నెలల పాటు రూ.58,944 అందిస్తున్నారు.

గుంత తవ్వకానికి మైదాన ప్రదేశాల్లో రూ.30, రహదారుల వెంట రూ.65 చొప్పున, మొక్క ఎదిగేందుకు కర్రను పాతినందుకు మరో రూ.25 చెల్లిస్తారు.

వీటితో పాటు ప్రతి మొక్కకు సంరక్షణ కోసం ఏడాదిలో 8 నెలల పాటు రూ.3 చొప్పున అందిస్తారు.

గ్రామాల్లో పంచాయతీ ట్రాక్టర్ లేకుంటే నీటి వసతి కల్పించేందుకు రూ.780 చెల్లిస్తున్నారు. ఒక్కో మొక్కపై రూ.వందల్లో వ్యయం చేస్తున్నా లెక్కల్లో మినహా ఎక్కడా కనిపించడం లేదు.

బీర్‌పూర్ మండలం కొల్వాయిలో ఉపాధిహామీ పథకంలో దాదాపు అయిదేళ్ల కిందట రూ.లక్షలు వెచ్చించి కోతుల ఆహారప్రాంగణం పేరిట మొక్కలు నాటారు. ఒక్క మొక్క కూడా కనిపించకపోవడంతో ఈ ఏడాది మళ్లీ నాటేందుకు గుంతలు తవ్వి వదిలేశారు.

సారంగాపూర్ మండలం పోతారం శివారులోని మ్యాకలబంద సమీపంలో బృహత్ పల్లె ప్రకృతివనం కోసం రూ.15,44,854 వ్యయం చేయగా, కేవలం బోర్డు మాత్రమే మిగిలింది.

ఈ రెండు చోట్లనే కాదు.. జిల్లావ్యాప్తంగా చాలా చోట్ల పల్లె ప్రకృతివనాలు, ఇతర మొక్కల పరిస్థితి ఇది.

**సాంకేతికత అమలు చేస్తున్నా..** మొక్కల సంరక్షణ కోసం ప్రత్యేక యాప్‌లు తీసుకొచ్చినా అమలులో లోపాలే కనపడుతున్నాయి. ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేస్తున్నామని అధికారులు చెబుతుండగా క్షేత్ర స్థాయిలో కనిపించడం లేదు. మొక్క చనిపోతే ఆ స్థానంలో మరోటి నాటాల్సి ఉండగా జిల్లాలో ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదు.

# తెప్పలపై.. ఇసుక తిప్పలు

మోతె : ఉధృతంగా ప్రవహిస్తున్న పాలేరు వాగులో ఇసుక కోసం తెప్పలతో వేట సాగిస్తున్నారు మండలంలోని నర్సింహాపురం మత్స్యకారులు. ఉర్లుగొండ–నర్సింహాపురం గ్రామాల మధ్య వంతెన సమీపంలో ఇరువైపులా పదడుగుల లోతున ప్రవహిస్తున్న నీటిలో ప్రమాదకర పరిస్థితుల్లో మునిగి ఇసుక తీస్తున్నారు.

వాగులో చేపల వేటకు ఉపయోగించే తెప్పలపై వెళ్లి.. ప్లాస్టిక్ తట్టల్లో నింపుకుని ఒడ్డుకు చేరి పై రెండు గ్రామాల మధ్యనున్న వంతెనపై కుప్పలు పోసి విక్రయిస్తున్నారు. ఏటికి అవతల ఉన్న నర్సింహాపురం గ్రామస్థులు ఈ దందాలో ఆరితేరారు. సుమారు 22 ట్రాక్టర్లు అక్రమ ఇసుక రవాణాకే వినియోగిస్తున్నారు. ఇలా ఒడ్డున పోసిన ఒక్కో ట్రాక్టరు ఇసుకను రూ.3 వేల వరకు సదరు వ్యక్తులు ట్రాక్టరు యజమానులకు విక్రయిస్తున్నారు. ట్రాక్టరు ఇసుకను వీరు రూ.7 వేల నుంచి రూ.10 వేల వరకు దూరాన్ని బట్టి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

ప్రధాన రహదారిలోని వంతెనపై కుప్పలు పోస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. నియంత్రించాల్సిన మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులెవరూ కన్నెత్తి చూడటం



లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

ఈ విషయాన్ని తహసీల్దార్ వెంకన్న దృష్టికి తీసుకెళ్లగా.. అనుమతుల్లేకుండా ప్రమాదకర పరిస్థితుల్లో ఇసుక తవ్వకాలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# అన్వేషణ

మేళ్లచెరువు: ఉమ్మడి నల్గొండ జిల్లాలో కొత్త గనుల కోసం వేట మొదలుకానుంది. దీనికి సంబంధించిన భౌగోళిక స్థితిగతులపై భూగర్భ గనుల శాఖ ఇప్పటికే కొన్ని ప్రాంతాలను ఎంపిక చేసుకున్నట్టు తెలిసింది. సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో సున్నపురాయి నిక్షేపాల ఆధారంగానే సిమెంటు పరిశ్రమల్ని నెలకొల్పిన విషయం తెలిసిందే. ఈ జిల్లాల్లో దాదాపు 16 సిమెంటు పరిశ్రమలను స్థాపించగా, కొన్ని మూతపడ్డాయి. మరికొన్ని నడుస్తూనే ఉన్నాయి.

ఈ పరిశ్రమలతో పాటు రాష్ట్రంలోని మరికొన్ని సిమెంటు కంపెనీలకు చెందిన పట్టా భూములూ వేలాది ఎకరాలు ఈ జిల్లాల్లోనే ఉన్నాయి. ప్రధానంగా సిమెంటు ఉత్పత్తికి అవసరమైన ఈ సున్నపురాయి కోసమే ఈ భూముల్ని ఆయా కంపెనీలు కొనుగోలు చేశాయి. ప్రభుత్వ భూములతో పాటు ప్రైవేటు పట్టా భూముల్లో గనుల తవ్వకాలు జరుగుతున్నాయి. తద్వారా ప్రభుత్వానికి రూ.కోట్లలోనే ఆదాయం సమకూరుతోంది. వందేళ్ల లీజు ఉన్న ప్రభుత్వ భూములతో పాటు ప్రైవేటు పట్టా భూముల్లోనూ సున్నపురాయి వెలికితీత నేపథ్యంలో ప్రభుత్వం మరింతగా ఆదాయ వనరును పెంచుకోనున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే కొత్త గనుల ఏర్పాటుకు అవకాశం ఉన్న ప్రాంతాలను ఎంపిక చేయాలని నిర్ణయించి అధికార యంత్రాంగాన్ని క్షేత్రస్థాయికి



పంపిస్తోంది. భూగర్భ గనుల శాఖ అధికార యంత్రాంగం ఈ పర్యటనలో నిమగ్నమైంది.

ప్రధానంగా మేళ్లచెరువు, చింతలపాలెం, మఠంపల్లితో పాటు నల్గొండ జిల్లాలో సిమెంటు పరిశ్రమలు, సున్నపురాయి గనులకు అవకాశం ఉన్న మరికొన్ని మండలాలపైనే దృష్టి సారించినట్టు సమాచారం. ప్రధాన సిమెంటు కంపెనీలు ఈ జిల్లాల్లోనే నెలకొన్నాయి. వీటిలో కొన్ని కంపెనీల నుంచి ఇతర దేశాలకూ సిమెంటు ఎగుమతైన సందర్భాలున్నాయి. ఈ నేపథ్యంలో ముున్ముందు గనుల విస్తరణకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. దాంతో పాటు ఆదాయాన్నీ పెంచుకోవాలని సంకల్పించిన ప్రభుత్వం ప్రైవేటు పట్టా భూముల్లో గనుల అన్వేషణ కోసం సర్వే చేపట్టనుంది. కొన్ని ఎంపిక చేసిన ప్రాంతాల్లో ప్రస్తుతం పంట పొలాలున్నందున సర్వే చేయడం సాధ్యం కాదు. భూగర్భంలో గనులు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవాలంటే.. కొంత లోతు వరకు తవ్వి శాంపిళ్లు సేకరించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ చేపట్టాలంటే దాదాపు ఎంపిక చేసిన ప్రాంతాలన్నీ రైతుల పట్టా భూములే కాబట్టి.. ముందు రెవెన్యూ అధికారుల సహకారం అవసరం. వారి సహకారం కోసం ఇప్పటికే భూగర్భ గనుల శాఖ యంత్రాంగం రెవెన్యూ అధికారుల్ని సంప్రదిస్తోంది. శాంపిళ్ల పరీక్షల ఆయా భూముల సేకరణకు రైతులతో ప్రభుత్వం సంప్రది ంపులు జరిపే అవకాశాలున్నాయని అధికార యంత్రాంగం పేర్కొంటోంది.

# నమ్మడమే తప్పు.. ఎంతకీ తీరదు అప్పు!

కొత్తగూడెం: మహిళా స్వయం సహాయక సంఘాల రుణ చెల్లింపులు పక్కదారి పడుతున్నాయి. రుణ వాయిదాలు చెల్లించే విషయంలో కొందరు అధికారులు, సిబ్బంది దుర్వినియోగానికి పాల్పడుతుండటం చర్చనీయాంశమవుతోంది. మహిళా సంఘం సభ్యులు నేరుగా బ్యాంకులకు వెళ్లకుండా గ్రామ సమాఖ్య సహాయకురాలు (వీఓఏ) లేదా ఇతర సిబ్బంది చేతికి నగదు రూపంలో ఇస్తుండటమే దీనికి కారణమవుతోంది. నగదును కొందరు సిబ్బంది, వీఓఏలు బ్యాంకుల్లో జమచేయకుండా తమ సొంత అవసరాలకు వాడుకుంటున్నారు.

**ప్రశ్నార్థకంగా పారదర్శకత..**

ఉభయ జిల్లాల్లోని సెర్ప్, మెప్మా విభాగాల్లో కొందరు ఉద్యోగుల పనితీరు ప్రశ్నార్థకంగా మారుతోంది. అక్రమాలకు పాల్పడిన వీఓఏలు లేదా సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవటంలో జాప్యం జరుగుతోంది. మహిళలు నష్టపోయిన మొత్తాన్ని సంబంధిత బాధ్యుల నుంచి స్వాధీనపరచుకోవటంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. 'కామేపల్లి మండలం పాతలింగాలలో చోటుచేసుకున్న అక్రమాలపై విచారణ జరిపాం. వీఓఏ తన సొంత అవసరాలకు రూ.8లక్షలకు పైగా వాడుకున్నట్లు తేలింది. అందులో రూ.లక్షను ఆమె తిరిగి చెల్లించారు. రుణ వాయిదాల చెల్లింపుల్లో అధికారులు, సిబ్బంది అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం' అని సెర్ప్ ఖమ్మం రీజినల్ మేనేజర్ రవీంద్రనాయక్‌కు తెలిపారు.

**మచ్చుకు కొన్ని..**



ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం పాతలింగాలలో వీఓఏ చేతివాటం తాజాగా వెలుగులోకి వచ్చింది. స్త్రీనిధి బకాయిలు చెల్లించేందుకు సభ్యులు ఇచ్చిన నగదు రూ.8,03,000తో పాటు మరో సంఘం సభ్యులకు తెలియకుండా వారి పేరిట రూ.9లక్షల రుణం తీసుకుని తన సొంతానికి వాడుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

భద్రాద్రి జిల్లా బూర్గంపాడు ఐకేపీ పరిధిలో స్త్రీనిధి రుణాల రికవరీ సొమ్ము సుమారు రూ.45లక్షలను ఓ సీసీ తన సొంత అవసరాలకు వినియోగించుకున్న ఘటన జూన్‌లో వెలుగుచూసింది.

సారపాకకు చెందిన ఓ మహిళా సంఘం సభ్యులు తొమ్మిది నెలల పాటు చెల్లించిన పొదుపు మొత్తం రూ.5.96లక్షలు, మరో సంఘం సభ్యులు చెల్లించిన రూ.1.25లక్షలను బుక్‌కీపర్ తన సొంతానికి వాడుకున్నట్లు వెల్లడైంది.

**వీటిపై దృష్టి సారిస్తేనే..**

రుణ వాయిదాలను నగదు రూపంలో మధ్యవర్తికి ఇవ్వకుండా సభ్యులే నేరుగా బ్యాంకుల్లో చెల్లించాలి. వీలైతే ఆన్‌లైన్ బ్యాంకింగ్, యూపీఐ వంటి డిజిటల్ పద్ధతులను ఆశ్రయించాలి.

మహిళా సంఘం సభ్యుల్లో కనీసం ఇద్దరు ప్రతినెలా బ్యాంకుకు వెళ్లి నగదు చెల్లింపులు సక్రమంగా నమోదవుతున్నాయో లేదో తనిఖీ చేయాలి. సంఘం తరఫున పర్యవేక్షణ కమిటీ ఏర్పాటుచేయాలి. రుణ చెల్లింపులు, పొదుపు జమ వంటి ఆర్థిక అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షించాలి. బ్యాంకు ఖాతా నిర్వహణ, పాస్‌బుక్ అప్‌డేట్, డెబిట్ కార్డుల వినియోగం, మొబైల్ బ్యాంకింగ్ వంటి అంశాలపై మహిళలకు నిరంతరం శిక్షణ తరగతులు నిర్వహించాలి.

# నేర ప్రవర్తన.. ఏదీ పరివర్తన..?

నిజామాబాద్ : ఇటీవల నిజామాబాద్‌లో కానిస్టేబుల్ ప్రమోద్‌ను వాహన దొంగ రియాజ్ (24) హత్య చేయడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. కొద్దిరోజుల వ్యవధిలో హైదరాబాద్‌లో కరుడుగట్టిన నేరస్థుడు అన్సారీ (32) డీఎస్పీ గన్‌మెన్‌పై కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఇలాంటి ఘటనలు వరుసగా చోటుచేసుకుంటున్నాయి. పోలీసులపై తిరగబడేవారిలో యువకులైన నేరగాళ్లే ఎక్కువగా ఉంటున్నారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోనూ మొత్తం 355 మందిపై రౌడీషీట్లు కొనసాగుతుండగా.. వీరిలో మూడోవంతు మంది 20-35 ఏళ్ల లోపువారే కావడం గమనార్హం.

**వాహనం మాయమైనా.. చోరీ జరిగినా**

జిల్లాలో చోరీలు, ముఖ్యంగా వాహన దొంగలు పేట్రేగిపోతున్నారు. కొందరు యువకులు జల్సాలు, సులువైన సంపాదనకు పక్కదారి పడుతున్నారు. సెప్టెంబరు 28న.. ఐదో ఠాణా పరిధి బ్రాహ్మణ కాలనీలోని ఇంట్లో దొంగతనం జరిగింది. 33 తులాల బంగారం, నగదు మాయమైంది. ఇది.. ఐదుగురు సభ్యుల ముఠా పని. పట్టుబడిన షేక్ సల్మాన్(25), మరాటి ఆకాశ్‌రావు(20)లు చిన్నవయసు వారే. పారిపోయిన మరో ముగ్గురిదీ పాతికేళ్ల లోపు వయసే. మరో ఘటనలో వాహనాలు చోరీ చేసే అంతర్రాష్ట్ర ముఠాను నిజామాబాద్ పోలీసులు ఇటీవల పట్టుకున్నారు. వారి వద్ద 9 ఆటోలు, 3 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ముఠా సభ్యులంతా 20-30 ఏళ్లలోపు వారే.

**మారకుండా.. మరింత ద్వేషంతో..**

ఏ నేర ఘటన జరిగినా, మూడు పదుల వయసు దాటని వారు నేరస్థులుగా చిక్కుతుండటంపై జిల్లా పోలీసు అధికారులు నివ్వెరబోతున్నారు. సత్ప్రవర్తనతో జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాల్సింది పోయి, చిన్న వయసులో కటకటాల పాలవుతున్నారని వారు పేర్కొంటున్నారు. కొందరు బెయిల్‌పై విడుదలైన తర్వాతా బుద్ధి మార్చుకోకపోవడం, సమాజం పట్ల మరింత ద్వేషంతో పాత నేర ప్రవృత్తిని కొనసాగిస్తుండటం అందరినీ కలవరపరుస్తోంది. ఇటీవల పోలీసు కాల్పుల్లో మరణించిన రియాజ్ నేపథ్యమే ఓ ఉదాహరణ. మూడుసార్లు బెయిల్‌పై బయటకొచ్చినా అతడు మారలేదు. చిన్నతనం నుంచే పిల్లల ప్రవర్తనను గమనించి, వారిని సరైన మార్గంలో నడిపించాల్సిన బాధ్యత కన్నవాళ్లపైనే ఎక్కువగా ఉంటుందని పోలీసు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. మత్తు అనర్థాలపై నిర్వహిస్తున్న అవగాహన సదస్సుల్లో సమాజ చైతన్యానికి కృషిచేస్తున్నారు.

**మందలించో.. ప్రేమతో నచ్చజెప్పో**

కులమతాలకు అతీతంగా పండగలు, సంబరాలు జరుపుకొనే ఇందూరులో.. కొందరు ఆర్థిక, రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు యువతను పెడదోవ పట్టిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఒకరు వర్గ విభేదాల సృష్టికి, ఇంకొకరు గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాల్లో ప్రోత్సహిస్తున్నారు. ఈ క్రమంలో కొందరు యువతను కరుడుగట్టిన నేరస్థులుగా తయారు చేస్తున్నారు. జిల్లాలో అర్ధాంతరంగా చదువు మానేస్తున్న వారిలో ఎక్కువ మంది మెకానిక్, ఆటోవాలా, కూలి తదితర పనులపై ఆధారపడుతున్నారు. కొందరు సులువుగా ఎదిగేందుకు గంజాయి సరఫరా, దొంగతనాల బాటపడుతున్నారని పోలీసు చెబుతున్నారు. తొలి నేరం సమయంలోనే కన్నవాళ్లు, కుటుంబీకులు గట్టిగా మందలించో, ప్రేమతో నచ్చజెప్పో పిల్లలను మార్చాలని సూచిస్తున్నారు. నేరగాళ్లతో స్నేహం చేయకుండా, గ్యాంగ్‌ల వెంట తిరగకుండా జాగ్రత్తపడాలన్నారు.

# మూడడుగులు ముందుకు.. రెండడుగులు వెనక్కు!

ఖమ్మం : వరదల నుంచి ఖమ్మం నగరవాసులను రక్షించేందుకు మున్నేరు నదికి రెండువైపులా కరకట్టలు (రిటైనింగ్ వాల్స్) నిర్మించేందుకు 'భూసేకరణ' అడ్డంకిగా మారింది. 2024 సెప్టెంబరులో మున్నేరుకు భారీ వరదలు రావటంతో దానవాయి గూడెం, పద్మావతినగర్, ఎఫ్‌సీఐ గోదాములు, సారథినగర్, వెంకటేశ్వరనగర్, కాల్వొడ్డు, బొక్కలగడ్డ, మోతీనగర్, రంగనాయకులగుట్ట, ప్రకాశ్‌నగర్, అగ్రహారం, ధంసలాపురం కొత్తకాలనీ, ఖమ్మం గ్రామీణ మండలం పెద్దతండా, జలగంనగర్, ఏదులాపురం, పోలేపల్లి ప్రాంతాలు నీటమునగటంతో స్థానికులు తీవ్ర నష్టం చవిచూశారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు వరదపాలయ్యాయి. అందుకే వరద నిరోధానికి నదికి రెండువైపులా కరకట్టలు నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించింది. నదికి ఒక్కోవైపు 8.50 కి.మీ. పొడవున 35 అడుగుల ఎత్తులో కరకట్ట నిర్మించాలని నిర్ణయించింది. నదికి రెండువైపులా అందుబాటులోని ప్రభుత్వ భూమిలో నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఇదంతా వరుసగా లేదు. అక్కడక్కడ ముక్కలుగా ఉంది. మధ్యలో పట్టా భూములు ఉండటం గమనార్హం.

**నష్టపరిహారంపై స్పష్టత వస్తేనే..**

ఖమ్మం గ్రామీణ మండలం వైపు కరుణగిరి చర్చి నిర్వాహకులు ఏడెకరాల భూమిని స్వచ్ఛందంగా అప్పగించారు. ఈస్థలంలో రక్షణ గోడ నిర్మాణం పూర్తయ్యింది. పోలేపల్లి, గోళ్లపాడు, గుదిమళ్ల, గుర్రాలపాడు, ఏదులాపురం రెవెన్యూ పరిధిలో పట్టాభూములు సేకరించాల్సి ఉంది. ఖమ్మం అర్బన్ మండలంలో మామిళ్లగూడెం, దానవాయి గూడెం, బుర్హాన్‌పురం, ఖమ్మం రెవెన్యూ గ్రామాల్లోని పట్టా భూములు కోల్పోతున్న రైతులు ఎక్కువ మంది వ్యతిరేకతతో ఉన్నారు. తమ భూములు విలువైనవని, నష్టపరిహారం ఎంత చెల్లిస్తారో ముందుగా తేల్చాలని బాధిత రైతులు కోరుతున్నారు.

ఖమ్మం గ్రామీణ మండలంలో 56.04 ఎకరాల పట్టా భూమి సేకరించాల్సి ఉండగా 24.07 ఎకరాలు ఇచ్చేందుకు రైతులు



అంగీకరించారు. ఖమ్మం అర్బన్ మండలంలో 82.27 ఎకరాలకు 45.05 ఎకరాలు అప్పగించేందుకు కర్షకులు మొగ్గుచూపారు. ఖమ్మం గ్రామీణ మండలం వైపు మున్నేరులో 8.50 కి.మీ. కరకట్ట (సిమెంట్ కాంక్రీట్ రిటైనింగ్ వాల్) నిర్మించాలి. 3,018 మీటర్ల పనులు పురోగతిలో ఉన్నాయి. 90 మీటర్ల గోడ నిర్మాణం పూర్తయ్యింది. ఖమ్మం అర్బన్ మండలం వైపు మున్నేరులో 8.50 కి.మీ. కరకట్ట నిర్మాణంలో 2,379 మీటర్ల పనులు పురోగతిలో ఉన్నాయి. 980 మీటర్ల గోడ నిర్మాణం పూర్తయ్యింది.

'భూసేకరణలో సమస్యలున్నా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచనలతో ముందుకు సాగుతున్నాం. భూమి కోల్పోయిన వారికి అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇవ్వాలని నిర్ణయించాం. ప్రకాశ్‌నగర్ నుంచి ధంసలాపురం కొత్తకాలనీ వరకు మున్నేరు నదికి రెండువైపులా సుమారు 12 కి.మీ. పొడవుతో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సర్వే జరుగుతోంది' అని ఖమ్మం నీటిపారుదలశాఖ ఎస్‌ఈ మంగళపుడి వెంకటేశ్వర్లుకు తెలిపారు.

# ఇంధన రహితం.. కేంద్రం అభిమతం




భగత్‌నగర్ : జిల్లా ఎలక్ట్రికల్ ఛార్జింగ్ స్టేషన్లకు అడ్డాకాబోతోంది. కేంద్ర ప్రభుత్వం శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గిస్తూ పునరుత్పాదక వనరుల వినియోగాన్ని పెంచడానికి ఎలక్ట్రికల్ వాహనాలను ప్రోత్సహిస్తోంది. మరో వైపు కాలుష్యాన్ని తగ్గించాలని చూస్తోంది. దీనిలో భాగంగా ఎలక్ట్రికల్ వాహనాలు(ఈవీ)లకు ఆర్థికంగా ప్రోత్సాహకాలు ఇస్తున్నా.. వినియోగం మాత్రం అనుకున్న స్థాయిలో లేదు. అందుబాటులో ఛార్జింగ్ స్టేషన్లు లేకపోవడమే దీనికి కారణమని తెలుస్తోంది. ఈ ఇబ్బందులను తొలగించడానికి కేంద్ర ప్రభుత్వం జిల్లాలో 150 స్టేషన్లు మంజూరు చేసింది.

**నూరు శాతం రాయితీ..**

జిల్లావ్యాప్తంగా 14 ఈవీ ఛార్జింగ్ స్టేషన్లే ఉన్నాయి. ప్రయాణం మధ్యలో ఛార్జింగ్ తగ్గితే తిరిగి పెట్టుకోవడానికి అందుబాటులో కేంద్రాలు లేకపోవడంతోనే వీటి కొనుగోళ్లలో పురోగతి లేదు. ఛార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసే స్థలాలను ఏ, బీ, సీ, డీ నాలుగు విభాగాలుగా గుర్తించి రాయితీలు ప్రకటించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్థలాలను 'ఏ' కేటగిరీగా గుర్తించింది. దీని కింద ఏర్పాటు చేసే వాటికి కేంద్రం నూరు శాతం మౌలిక సదుపాయాలకు నిధులు ఇస్తుంది. ఎలక్ట్రిక్ వెహికిల్ సప్లయ్ ఎక్విప్‌మెంట్ (ఈవీఎస్‌ఈ)కు అయ్యే ఖర్చు నిధులు అందజేస్తుంది.

ఏ, బీ కేటగిరీలో లేని ప్రాంతాలు షాపింగ్ మాల్‌లు, మార్కెట్ కాంప్లెక్స్‌లలో ఏర్పాటు చేసే వాటికి మౌలిక సౌకర్యాలకు మాత్రం 80 శాతం రాయితీ ఇవ్వనుంది

బ్యాటరీ మార్చే కేంద్రాలను 'సీ' కేటగిరీగా గుర్తించారు. మౌలిక సౌకర్యాల ఏర్పాటుకు 80 శాతం రాయితీ కింద కేంద్రం నిధులు ఇస్తుంది.

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు, పబ్లిక్ సెక్టార్ల ఆధీనంలో లేదా నిర్వహణలో ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటు చేసే ఈవీ ఛార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవచ్చు. ఆయా ప్రాంతాలను 'బీ' కేటగిరీగా గుర్తించింది. రైల్వే స్టేషన్లు, విమానాశ్రమాలు, ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల విక్రయ కేంద్రాలు, బస్‌స్టేషన్లు, నగర, పురపాలక పార్కుల్లో ఏర్పాటు చేసేవాటికి మౌలిక సౌకర్యాల ఏర్పాటుకయ్యే ఖర్చులో 80 శాతం, ఈవీఎస్‌ఈకి అయ్యే ఖర్చుకు 70 శాతం నిధులను కేంద్రం ఇస్తుంది. మిగతా నిధులు సంబంధిత శాఖ పెట్టాల్సి ఉంటుంది.

**జిల్లాలో 48 ప్రాంతాల గుర్తింపు**

విద్యుత్తు అధికారులు జిల్లా కేంద్రంతోపాటు హైవేలలో ప్రభుత్వ, పబ్లిక్ రంగ సంస్థల స్థలాల్లో ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడానికి 48 ప్రాంతాలను గుర్తించాం. ఇందులో 24 ప్రభుత్వ స్థలాలు, 12 ప్రభుత్వ రంగ సంస్థల స్థలాలు ఉన్నాయి. బ్యాటరీ మార్చుకునే స్థలాలను ఇంకా గుర్తించలేదు. మేక రమేశ్‌బాబు, ఎస్‌ఈ, విద్యుత్తు శాఖ

# కాలనీల కన్నీళ్లు.. 'కరకట్ట'తో దూరం



మంచిర్యాల : మంచిర్యాల నగరంలో రాళ్లవాగు కరకట్ట నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఏటా వర్షాకాలంలో గోదావరి నదిలో వరద పెరిగినప్పుడల్లా రాళ్లవాగు బ్యాక్ వాటర్‌తో సరిహద్దు కాలనీలు నీటమునిగి ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు రాళ్లవాగుకు కరకట్ట నిర్మించి కాలనీలు ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నిర్మాణం కోసం రూ.255 కోట్లు మంజూరు చేయించారు. నగర సరిహద్దులోని గోదావరినది నుంచి పాతమంచిర్యాల మీదుగా స్థానిక కార్మెల్ పాఠశాల వరకు రాళ్లవాగుకు ఎడమ పక్క దాదాపు ఏడు కిలోమీటర్ల పొడవున్న కరకట్ట నిర్మించనున్నారు. ఈ పనులు ఆరు నెలల కిందటే చేపట్టగా.. వర్షాల కారణంగా ఆగిపోయాయి. అప్పుడు కరకట్ట నిర్మాణం కోసం చదును చేసిన మట్టి రాళ్లవాగు వరద నీటిలో కొట్టుకుపోయింది. తాజాగా రెండు వారాల నుంచి కరకట్ట నిర్మాణం కోసం రాళ్లవాగులో తవ్వకాలు చేపడుతున్నారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు సూచన మేరకు ఇక్కడ కరకట్ట నిర్మాణ పనుల్లో వేగం పెంచారు.

**వర్షాకాలం కాలనీలు జలమయం**

ఏటా వర్షాకాలం వచ్చిందంటే మంచిర్యాలలో రాళ్లవాగు లోతట్టు ప్రాంతాల ప్రజలకు కంటి మీద కునుకు లేకుండాపోతోంది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురిస్తే ఎల్లంపల్లి జలాశయం గేట్లు ఎత్తి దిగువకు నీరు విడుదల చేస్తున్నారు. అప్పుడు రాళ్లవాగులో వరదనీరు పెరిగి వెనక్కి వస్తోంది. లోతట్టు ప్రాంతాలైన ఎన్టీఆర్‌నగర్, రాంనగర్, బాలాజీనగర్, ఎల్ఐసీ కాలనీ, పద్మశాలీ కాలనీలు నీటమునిగి భారీ నష్టం జరుగుతోంది. ఇప్పుడు చేపట్టే కరకట్ట నిర్మాణంతో కాలనీలకు ముంపు బెడద తగ్గే అవకాశముంది. ఆ కరకట్ట ఒకే పక్కన నిర్మించడంతో రాళ్లవాగుకు కుడిపక్కన ఉన్న పాతమంచిర్యాల, పవర్ సిటీ కాలనీ, శ్రీనిధి కాలనీ ప్రజలకు వరదనీరు వచ్చే ప్రమాదముందని ఆందోళన చెందుతున్నారు. రాళ్లవాగుకు ఎడమ పక్క కరకట్ట నిర్మాణం పనులు పూర్తయ్యేలోపు కుడి పక్క కరకట్ట నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని ఎమ్మెల్యేను ప్రజలు కోరుతున్నారు.

# వంట కార్మికులకు ఉపశమనం

కరీంనగర్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం వంట ధరలను ప్రభుత్వం పెంచడంతో వంట కార్మికులకు కొంత ఉపశమనం లభించింది. కొన్ని రోజులుగా మెస్ ఛార్జీలు పెరగక ఇక్కట్లు పడుతున్నామని పేర్కొన్న కార్మికులు ప్రభుత్వ నిర్ణయంతో సంతోషపడుతున్నారు. ఈ నేపథ్యంలో పెంచిన వంట ధరలను వెంటనే అమలు చేయాలని జిల్లా విద్యాశాఖకు ఉత్తర్వులు జారీ చేశారు.

**1050 మందికి లబ్ధి..** జిల్లాలోని 619 ప్రభుత్వ విద్యాసంస్థల్లో మధ్యాహ్న భోజనం వంట ఏజెన్సీలు ఉన్నాయి. వాటిల్లోని 1050 మంది కార్మికులకు పెంచిన వంట ధరలతో ఊరట లభిస్తుంది. ఒక్కో విద్యార్థికి ప్రాథమిక పాఠశాలల్లో 74 పైసలు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో రూ.1.12 పైసల చొప్పున వంట ధరలు పెంచారు. ఈ నిర్ణయంతో వంట కార్మికులకు కొంత ప్రయోజనం చేకూరనుంది.

**619 పాఠశాలల్లో..**

జిల్లాలోని 619 ప్రభుత్వ విద్యాసంస్థల్లో 1-10వ తరగతి వరకు విద్యార్థులకు మధ్నాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నారు. ప్రస్తుతం దీని కింద 37,055 మంది ప్రయోజనం పొందుతున్నారు. మధ్యాహ్న భోజనం కోసం ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యం అందిస్తోంది. మిగిలిన వంట సరకులను వంట ఏజెన్సీల నిర్వాహకులు స్వతహాగా కొనుగోలు చేస్తున్నారు. వాటికి నెలనెలా విద్యాశాఖ బిల్లుల రూపంలో నిధులను చెల్లిస్తున్నారు. ఈ సరకులకు ఖర్చుల కోసం వంట కార్మికులకు చెల్లించే ధరలను ప్రభుత్వం పెంచింది.




**వేతనాలు పెంచాలి** ప్రభుత్వం వంట ధరలను పెంచడంతో కార్మికులకు ఊరట కల్గింది. బిల్లులను నెలనెలా చెల్లించేలా ప్రభుత్వం దృష్టి నిలపాలి. వంట కార్మికులకు నెల వేతనం రూ.10 వేల చొప్పున చెల్లిస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వ హామీని వెంటనే అమలు చేయాలి. బాబాయమ్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మధ్యాహ్న భోజన వంట కార్మికుల సంఘం

# త్వరలో టీడీఆర్ సమస్యకు స్వస్తి

హైదరాబాద్: గ్రేటర్ పరిధిలో రహదారుల అభివృద్ధికి చాలా మంది తమ భూములను ఇచ్చారు.. చెరువుల సుందరీకరణకు ఆస్తులను అప్పగించారు. ఆయా భూముల్లో ప్రభుత్వం పైవంతెనలు, అండర్‌పాస్‌లను నిర్మించింది, రహదారులను విస్తరించింది. భూములు ఇచ్చినోళ్లు మాత్రం అవస్థలు పడుతూనే ఉన్నారు. ప్రభుత్వం టీడీఆర్(అభివృద్ధి బదలాయింపు హక్కు)ను అమ్ముకోలేక అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్, నగర ముఖ్య ప్రణాళికాధికారి సంతకాల కోసం నెలలపాటు వేచి చూస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించడంపై తాజాగా పురపాలకశాఖ దృష్టి పెట్టింది. టీడీఆర్‌ను యజమానులు స్వేచ్ఛగా అమ్ముకునే వెసులుబాటు కల్పించాలని ప్రాథమికంగా నిర్ణయించింది.

సర్టిఫికెట్ల జారీ జీహెచ్‌ఎంసీ 2017 నుంచి జరిగిన అభివృద్ధి పనులకు రూ.10వేల కోట్ల విలువైన టీడీఆర్ సర్టిఫికెట్లు జారీ చేసింది. నగదు రూపంలో నష్ట పరిహారం చెల్లించలేక, టీడీఆర్ సర్టిఫికెట్లను జారీచేసింది. కాంగ్రెస్ సర్కారు ఏర్పడ్డాక.. కొత్త టీడీఆర్ జారీ కాలేదు. క్రమంగా డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం 50శాతం ధర పలుకుతోంది. అయితే అధికారుల రూపంలో వారికి కొత్త సమస్య ఎదురైంది. కమిషనర్



ఆర్వీ కర్ణన్ చాలా రోజులపాటు సర్టిఫికెట్ల అమ్మకం దరఖాస్తులను పక్కనపెట్టారు. కొంత కాలంగా సంతకాలు చేస్తున్నా.. తమ ఆస్తిని అమ్ముకునేందుకు అధికారి సంతకం ఎందుకని బాధితులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. సంతకాలు అవసరం లేదనే ఉత్తర్వు వచ్చాక.. టీడీఆర్ బ్యాంక్ పేరుతో సరికొత్త వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని ఓ అధికారితో చెప్పారు.

# ధాన్యం కొనుగోళ్లలో.. ఆధునిక యంత్ర దన్ను..!

పెనుబల్లి: అన్నదాతలు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ఆధునిక సాంకేతిక యంత్రాలు దన్నుగా నిలుస్తున్నాయి. వీటి వినియోగంతో అక్రమాలకు అడ్డుకట్ట పడుతోంది. ఖరీఫ్‌లో ఖమ్మం జిల్లాలో 3.02 లక్షల ఎకరాలు, భద్రాద్రి జిల్లాలో 1.74 లక్షల ఎకరాల్లో వరి సాగుచేయగా సుమారు 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇందులో ఖమ్మం జిల్లాలో 3.69 లక్షల టన్నులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2.38లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని నిర్ణయించారు. గ్రామాల్లో ఐకేపీ, సొసైటీల ద్వారా సన్న, దొడ్డు రకాల వడ్ల కొనుగోలుకు ఖమ్మం జిల్లాలో 326 ధాన్యం కొనుగోలు కేంద్రాలు, భద్రాద్రి జిల్లాలో ఇప్పటివరకు 138 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుత నిబంధనలకు అదనంగా నూతన మార్గదర్శకాలనూ జారీ చేశారు. ఇందుకు అవసరమైన పరికరాలను కొనుగోలు కేంద్రాలకు అందించారు.

**తేమశాతాన్ని తగ్గించేందుకు..**

రైతులు కేంద్రాలకు తెచ్చిన ధాన్యంలో తేమశాతాన్ని తగ్గించేందుకు ఈసారి 'ప్యాడీ డ్రయర్'ను వినియోగించుకోవచ్చు. ఈయంత్రం రెండున్నర గంటల్లో 20 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఆరబెడుతుంది. ఖమ్మం జిల్లాలోని కల్లూరు, మధిర, నేలకొండపల్లి, వైరా మార్కెట్ కమిటీల పరిధిలో నాలుగు, భద్రాద్రి జిల్లాలో ఒక డ్రయర్‌ను అందుబాటులో ఉంచారు.

**గ్రెయిన్ కాలిపర్‌తో గుర్తింపు..**

సన్నరకం ధాన్యం నాణ్యతను కొలిచేందుకు గ్రెయిన్ కాలిపర్ అనే పరికరాన్ని వినియోగిస్తున్నారు. గింజ నిడివి, వెడల్పును కొలుస్తారు. పొడవు 6 మి.మి. కంటే తక్కువ, వెడల్పు 2 మి.మి. కంటే తక్కువగా ఉంటేనే సన్నాలుగా నిర్ధారిస్తారు.



**ప్రతి బస్తాకు కోడ్..**

రాష్ట్ర ప్రభుత్వం సన్నాలకు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తోంది. గోనెసంచులను రివర్స్ తీసి అందులో ధాన్యం నింపుతారు. అనంతరం ఎరుపు రంగు దారంతో కుట్టడంతో పాటు ప్రతి బస్తాపై ఎరుపు రంగుతో 'ఎస్'అనే అక్షరంతో కోడ్ రాస్తారు. దొడ్డు రకానికి ఆకు పచ్చరంగు కోడ్ వేస్తారు.

**బినామీలకు చెల్లుచీటీ..**

ధాన్యం కొనుగోళ్లలో బినామీలకు చెక్ పెట్టేందుకు ఐరిస్ విధానాన్ని అమలుచేస్తున్నారు. కేంద్రాల నుంచి లారీల్లో ధాన్యాన్ని పంపే సమయంలో ఓటీపీ వినియోగించేవారు. ఈసారి క్రయవిక్రయాలన్నీ కనుపాపల ఆధారంగా సాగనున్నందున బినామీ దందాలకు అడ్డుకట్ట పడనుంది.

**పొట్టు తీసేందుకు.. ప్యాడీ హస్కల్..**

ప్రభుత్వం 33 రకాల సన్నాలను గుర్తించింది. వీటిని చేతులతో గట్టిగా నలిపి బియ్యం నాణ్యత పరిశీలించేవారు. తాజాగా ప్రతి కొనుగోలు కేంద్రానికి ఒక ప్యాడీ హస్కల్ పరికరాన్ని అందించారు. గుప్పెడు ధాన్యం అందులో పోసి తిప్పితే పొట్టు ఊడిపోయి బియ్యం బయటికొస్తాయి. అనంతరం నాణ్యతను నిర్ధారిస్తారు.

# కొబ్బరి.. ఇక్కడే ఊపిరి!

అశ్వారావుపేట : 'అశ్వారావుపేట కొబ్బరి విత్తనోత్పత్తి క్షేత్రంలో నూతన హైబ్రీడ్ గింజలను ఇటీవల నాటాం. అవి కాపు కాస్తే వాటి ద్వారా విత్తనోత్పత్తికి శ్రీకారం చుడతాం' అని డీహెచ్‌ఎస్‌ఓ జంగా కిశోర్'కు తెలిపారు. కొబ్బరి తోటలు అనగానే ముందుగా ఏపీలోని కోనసీమ గుర్తుకొస్తుంది. కోనసీమకు ఏమాత్రం తీసిపోని విధంగా రూపుదిద్దుకుంటున్నాయి అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లోని కొబ్బరి క్షేత్రాలు. కొబ్బరిలో అంతరపంటలుగా కోకో, వక్క తోటలతో అలరారుతున్న అశ్వారావుపేట ప్రాంతాన్ని తెలంగాణ కోనసీమ అంటూ ముద్దుగా పిలుచుకుంటారు. అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో సుమారు 7వేలకు పైగా కొబ్బరి తోటలు విస్తరించాయి. ఆయిల్‌పాం హబ్‌గా పేరొందిన అశ్వారావుపేట ప్రాంతం.. కొబ్బరి క్షేత్రాలు, కొబ్బరి నర్సరీలతో పచ్చందం పరచుకున్నట్లు కనువిందు చేస్తుంది. ఇక్కడ అధికంగా ఈసీ టాల్(ఈస్ట్‌కోస్ట్ టాల్), గంగాబోండాం, మలయన్ ఎల్లో డ్వార్ఫ్, మలయన్ గ్రీన్ డ్వార్ఫ్, మలయన్ ఆరెంజ్ డ్వార్ఫ్, గంగా గోదావరి రకాలు ఉన్నాయి.

పదేళ్లలో కొబ్బరి విత్తనాల విక్రయం ద్వారా అశ్వారావుపేట కొబ్బరి విత్తనోత్పత్తి క్షేత్రం సుమారు రూ.3కోట్లు సముపార్జించింది.

ఏటా లక్షలాది మొక్కల ఎగుమతి..!

ఉద్యానశాఖ ఆధ్వర్యంలో అశ్వారావుపేట, అచ్యుతాపురం నర్సరీల్లో కొబ్బరి మొక్కలు పెంచుతున్నారు. అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో పదుల సంఖ్యలోని ప్రైవేటు నర్సరీల్లో లక్షలాది కొబ్బరి మొక్కలు పెంచుతుండటం గమనార్హం. ఒక్కో మొక్కను ప్రభుత్వ నర్సరీల్లో రూ.70కు విక్రయిస్తుండగా, ప్రైవేటు నర్సరీల్లో రూ.100-150కు అమ్ముతున్నారు. ఏటా ఈ ప్రాంత నర్సరీల నుంచి తెలంగాణలోని జిల్లాలకే కాకుండా ఏపీలో కడప, కర్నూలుతో పాటు ఒడిశా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, అస్సాం రాష్ట్రాలకు 5-6లక్షల కొబ్బరి మొక్కలను ఎగుమతి చేస్తున్నారు.

వందలాది మందికి ఉపాధి..! ఇంతగా విస్తరించిన కొబ్బరి నర్సరీల్లో పదుల సంఖ్యలో కూలీలకు ఉపాధి లభిస్తోంది. లక్ష మొక్కలు పెంచే నర్సరీలో ఏడాది పొడవునా ఆరు నుంచి ఎనిమిది మందికి పని దొరుకుతోంది. సీజన్ (విత్తనం నాటేటప్పుడు, లారీల్లో లోడు చేసేటప్పుడు)లో 25మందికి పని లభిస్తుంది. సగటున ప్రతి సంవత్సరం సుమారు రూ.5కోట్ల నుంచి రూ.7కోట్ల లావాదేవీలు జరుగుతున్నాయి. తెలంగాణలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఏకైక కొబ్బరి నర్సరీ అశ్వారావుపేటలో కొనసాగుతోంది. 50 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన ఈ క్షేత్రంలో ఏటా 1-1.50 లక్షల మొక్కలను ఉత్పత్తి చేస్తుంటారు.

# స్వశక్తికి అక్షర వెలుగులు

మెట్‌పల్లి : గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులైన మహిళల్లో అక్షర వెలుగులు నింపడంతో పాటు చదువు మధ్యలో ఆపేసిన వారికి విద్య అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యాచరణ చేపట్టాయి. విద్యాశాఖ, సెర్ప్ సంయుక్త ఆధ్వర్యంలో ఉల్లాస్(అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ సొసైటీ), తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం(టాస్) ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే ప్రక్రియ ప్రారంభించారు. ఈ మేరకు జిల్లాలోని స్వశక్తి సంఘాల్లో చదువు రాని, మధ్యలో ఆపేసిన సభ్యులను గుర్తించి ఇప్పటికే యాప్‌లో వివరాలు నమోదు చేశారు. వీరికి చదువు నేర్పి ఆర్థిక డిజిటల్ అక్షరాస్యత, వాణిజ్య నైపుణ్యాలు, ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పిస్తారు.

**41,797 మంది గుర్తింపు**

జిల్లాలో 14 వేలకు పైగా స్వయం సహాయక సంఘాల్లో 1.79 లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా వీరిలో అక్షరాస్యత పెంపొందించడానికి నడుం బిగించారు.

ఇందులో భాగంగా క్షేత్ర స్థాయిలో నిరక్షరాస్యులైన అతివలను గుర్తించారు. గ్రామాల్లో సర్వే నిర్వహించి జిల్లావ్యాప్తంగా 41,797 మందిని నిరక్షరాస్యులను గుర్తించారు.

వీరికి అక్షరాలు నేర్పడానికి పది మందికి ఒకరు చొప్పున సంఘాల్లోని ఔత్సాహిక మహిళలను వాలంటీర్లుగా ఎంపిక చేశారు.

జిల్లావ్యాప్తంగా 4,151 మంది వాలంటీర్లను గుర్తించి వివరాలను యాప్‌లో నమోదు చేశారు. మండలాల వారీగా ఉపాధ్యాయులకు, వీవోఏలకు శిక్షణ ఇచ్చారు. చదువు చెప్పేందుకు అవసరమైన పుస్తకాలు మండలాలకు చేరుకున్నాయి. గ్రామ స్థాయిలో వాలంటీర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. చదువు నేర్చుకున్న తర్వాత వచ్చే ధ్రువీకరణ పత్రంతో మహిళలు తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం(టాస్) ద్వారా పదో తరగతి, ఆపై చదువు పూర్తి చేసే అవకాశం కల్పించారు.

**మధ్యలో ఆపేసిన వారికి సార్వత్రిక విద్య**



ఆర్థిక వెనుకబాటు, కుటుంబ పరిస్థితులతో మధ్యలో చదువు ఆపేసిన మహిళలపైనా దృష్టి సారించారు. తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం(టాస్) ద్వారా వీరికి అవసరమైన విద్య అందించడానికి చర్యలు తీసుకుంటున్నారు. వారిని ఓపెన్ స్కూల్‌లో చేర్పించి చదువుకొనేలా ప్రోత్సహిస్తున్నారు. జిల్లాలో పదో తరగతిలోపు 373 మంది, ఇంటర్మీడియట్‌లోపు 510 మంది మహిళలు చదువు ఆపేసినట్లు గుర్తించారు. వీరు పై చదువులు చదివేలా అవగాహన కల్పించారు. ఉన్నత విద్యతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రోత్సహిస్తూ ఇప్పటివరకు 291 మంది పదో తరగతి, 419 మంది ఇంటర్‌లో చేరేందుకు ప్రవేశ రుసుం చెల్లించారు. స్వశక్తి సంఘాల సభ్యుల్లో పూర్తి స్థాయిలో అక్షరాస్యులైన సభ్యులే ఉండేలా చూస్తూ వారికి భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు పెంచడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

# చేను బురదైంది.. కోతకు కష్టమొచ్చింది

భైంసా: జిల్లాలో సోయా రైతులకు కష్టమొచ్చింది. మొన్నటివరకు వరదలతో లోతట్టు, నదీ పరీవాహక ప్రాంతాల్లో పంటలు మునిగిపోయాయి. కాత దశలో సోయా మురిగిపోయింది. ఇతర ప్రాంతాల్లో సురక్షితంగా ఉన్న పంట చేతికొచ్చే సమయంలో వరుసగా కురుస్తున్న వర్షాలకు చేలల్లో నీరు నిలవడంతో కోత కోసే వీలు లేకుండా పోయింది. హార్వేస్టర్లు చేలలో నడిచే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో కోతకొచ్చిన సోయా పంట కాతలో మొలకలు వస్తున్నాయి. ఆరుగాలం శ్రమ వర్షార్పణం కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

నష్టాలు ఎలా పూడ్చాలని కన్నీటి పర్యంతమవుతున్నారు.

**అధికారి ఏమంటున్నారంటే..**

గజిల్లాలో కోతలకు సరిపోయే హార్వేస్టర్లు ప్రైవేటులో అందుబాటులో ఉన్నాయని డీఏఓ అంజిప్రసాద్ అన్నారు. రైతులు చేలలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు.

జిల్లాలో 1.10 లక్షల ఎకరాల విస్తీర్ణంతో సోయా పంట సాగు చేస్తుండగా, అత్యధిక విస్తీర్ణంలో ముథోల్ నియోజకవర్గంలో 80 వేల ఎకరాల్లో, సారంగాపూర్, లక్ష్మణచాంద, మామడ, సోన్, నర్సాపూర్ మండలాల్లో సాగవుతోంది. ఈ లెక్కన ఇక్కడి రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. ఇప్పటికే బాసర, భైంసా, తానూరు, ముథోల్ మండలాల్లో సోయా పంటలు నీట మునిగాయి.



వానలు వెనుకబడిన వెంటనే కోతకొచ్చిన సోయా పంట కోతలు మొదలు చేసేందుకు యంత్రాల కొరత ఉన్నట్లు తెలుస్తోంది. అందుబాటులో ఉన్న టైర్ల యంత్రాలు చేలల్లో దిగబడుతున్నాయి. చైన్ హార్వేస్టర్లు రావడం లేదు. వచ్చినా వాటి అద్దె ధరలు ఎక్కువ ఉన్నట్లు రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు కోత యంత్రాలను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. కూలీల కొరత, వ్యయం ఎక్కువ కావడంతో వెనుకడుగు వేస్తున్నారు. భూములు ఆరే వరకు వేచిచూస్తున్నారు. పది రోజులుగా పగలు ఎండ, రాత్రి వాన కురుస్తుండటంతో పంట కోతలకు రైతులకు బెంగ పట్టుకుంది.

**మొలకలు వస్తున్నాయి**

బొంతల్‌వాడ్ మారుతి రైతు, నందగాం తానూరు మండలం

ఏడు ఎకరాల్లో సోయా సాగు చేశా. ప్రస్తుతం కోతకు వచ్చింది. వానలకు మూడు ఎకరాల్లోని పంటకు కాయల్లో గింజలకు మొలకలు వస్తున్నాయి. దీంతో పంటకు చేసిన వ్యయం నష్టపోతున్నా. ఎకరాకు 20 వేలకు వరకు ఖర్చయింది. ఎకరాకు 8 నుంచి 10 పది క్వింటాళు దిగుబడి వచ్చేది రాకుండా పోతోంది.

# నిధుల్లేక నిర్వహణ భారం



సారంగాపూర్ : పంచాయతీల్లో రెండేళ్లుగా పాలకవర్గాలు లేక ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోయాయి. సారంగాపూర్ మండలంలోని ఓ చిన్న పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్యం, పైపులైన్ల మరమ్మతు, వీధి దీపాలు.. తదితర అవసరాలకు కార్యదర్శి రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకు సొంత డబ్బులు వెచ్చించారు. బీర్‌పూర్ మండలంలోని ఓ పంచాయతీ కార్యదర్శి దాదాపు రూ.లక్షకు పైగా పెట్టారు. ఇటీవల ఆయన అనారోగ్యం బారిన పడితే డబ్బులు లేక ఇబ్బందులు పడాల్సి వచ్చింది. పాలకవర్గాలు లేక, అవసరాలు తీరేందుకు నిధులు లేక కార్యదర్శులు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు.

**కనిపించని ప్రత్యేకాధికారులు**

పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణ, హరితహారం కోసం పంచాయతీకి ఒకటి చొప్పున ట్రాక్టర్, ట్రాలీతో పాటు ట్యాంకర్, చదును చేసే బ్లేడ్‌లను 2019లో నాటి ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి కొనుగోలు చేసింది.

పల్లెల రూపురేఖలు మార్చాలన్న సంకల్పంతో గ్రామాల్లో డంపింగ్ యార్డులు ఏర్పాటు చేసింది. గ్రామంలో ఇంటింటికీ ట్రాక్టర్ల ద్వారా చెత్త సేకరణకు చర్యలు తీసుకుంది.

నిధుల లేమితో వాహనాల నిర్వహణ భారం పెరిగి ప్రభుత్వ ఆశయం నీరుగారుతోంది.

జిల్లాలో మొత్తం 385 పంచాయతీలుండగా 60 గిరిజన తండాలు, చిన్న గ్రామాలకు ఆర్థిక ఇబ్బందులు తీవ్రమయ్యాయి.

ట్రాక్టర్ల రుణం చెల్లించకపోవడంతో పలు పంచాయతీలకు బ్యాంకు అధికారులు నోటీసులు జారీ చేశారు.

డీజిల్‌కు డబ్బులు లేక కొన్నింటిని పక్కన పెట్టేశారు. ఏడాదికిపైగా మూలన పడేయడంతో వాహనాలు తుప్పు పట్టడంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది.

ప్రత్యేకాధికారిని నియమించినా ఎప్పుడూ కనపడటం లేదు. వివిధ శాఖల్లో పని చేస్తున్న వారిని ప్రత్యేకాధికారులుగా నియమించడంతో సొంత శాఖలకే పరిమితమవుతున్నారు.

గ్రామసభ నిర్వహించినపుడు, అత్యవసర సమావేశాలకు మినహా ఎప్పుడూ హాజరు కావడం లేదన్న ఆరోపణలున్నాయి.

బీర్‌పూర్ మండలం కొల్వాయి నుంచి కోమన్‌పల్లిని ప్రత్యేక పంచాయతీగా మార్చారు. చిన్న గ్రామం కావడంతో రెండేళ్లుగా ప్రభుత్వం నుంచి నిధులు రాలేదు. ట్రాక్టర్ మరమ్మతుకు డబ్బులు లేక మూలనపడేశారు.

సారంగాపూర్ మండలం నాయకపుగూడెం పంచాయతీ పరిధిలో కొనుగోలు చేసిన ట్రాక్టర్‌కు బ్యాంకు రుణం రూ.2 లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. ఏడాదిగా పంచాయతీలో డబ్బులు లేకపోవడంతో మరమ్మతులు చేయించలేని పరిస్థితులు. మరోవైపు గ్రామంలో చెత్త సేకరణకు ట్రాక్టరును అద్దెకు తీసుకొని వారానికోసారి తరలిస్తున్నారు. .. ఇది ఈ రెండు గ్రామాల పరిస్థితే కాదు.. జిల్లాలోని అన్ని చిన్న పంచాయతీలదీ.

# దశాబ్దాలుగా అవే సమస్యలు



జగిత్యాల : జిల్లాలో వానాకాలం వరి కోతలు ప్రారంభం కావడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. కేంద్రాల సంఖ్యలో రాష్ట్రంలోనే రెండో స్థానంలో జిల్లా నిలవనుంది. 2006 నుంచి 37 సీజన్లుగా కేంద్రాలు ఏర్పాటు చేస్తుండగా ఇప్పటికీ పూర్తి స్థాయిలో వసతులు కల్పించక రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

**ధాన్యం తడిస్తే నిర్వాహకులదే బాధ్యత**

ఈసారి నాట్లు ముందుగా వేయడంతో కోతలు కూడా ముందే ప్రారంభమయ్యాయి. ఇప్పటికే కల్లాలకు ధాన్యం వస్తున్నందున కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాల్సి ఉంది.

ఐకేపీ, ప్యాక్స్, మెప్మా, రైతు సంఘాల ఆధ్వర్యంలో శాశ్వత సిబ్బందిని నియమించాలి. గత సీజన్లలో పలు చోట్ల వచ్చిన కమీషన్‌ను పక్కదారి పట్టించారనే ఆరోపణలున్నందున పర్యవేక్షణ పకడ్బందీగా నిర్వహించాలి.

ప్యాడీ క్లీనర్లు, తూకం, తేమ యంత్రాలు, గన్నీ సంచులు తదితర సామగ్రిని నిల్వ చేసేందుకు గదులు నిర్మించాలి. కేంద్రాల్లో నీడ, తాగునీరు, విద్యుత్తు వంటి వసతులు కల్పించాలి.

కేంద్రాల్లో ధాన్యం, తూకం వేసిన బస్తాలకు రక్షణ కరవైంది. ప్యాడీ డ్రయ్యర్లను అందుబాటులోకి తెస్తే సేకరణ వేగవంతమవుతుంది.

అన్ని కేంద్రాల్లో మట్టి కల్లాలే ఉండటంతో వర్షాలు కురిసినపుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శాశ్వత స్థలాలున్న కేంద్రాల్లో సిమెంటు గచ్చు నిర్మించాలి.

గతంలో సరఫరా చేసిన టార్పాలిన్లు చిరిగిపోయినందున కొత్తవి ఇవ్వాలి.

ఈసారి కేంద్రాల్లో ధాన్యం తడిస్తే నిర్వాహకులదే పూర్తి బాధ్యత అని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కౌలు రైతుల సాగు భూముల వివరాలను వ్యవసాయ శాఖ ఓపీఎంఎస్ లాగిన్‌లో నమోదు చేసుకోవాలి.

నిర్వాహకులకు కమీషన్‌ను, క్వింటాలుకు రూ.5 చొప్పున హమాలీ ఛార్జీలను విడుదల చేయాలి.

**బోనస్ బకాయిలు రూ.2.50 కోట్లు**

యాసంగి సన్న ధాన్యం బోనస్ ఇప్పటికీ రాలేదు. జిల్లావ్యాప్తంగా దాదాపు రూ.2.50 కోట్లు రావాల్సి ఉంది. కేంద్రాల నుంచి మిల్లులకు పంపించిన ధాన్యంలో తరుగు, తేమ పేరిట కోతలు విధించకుండా చూడాలి. హమాలీ ఛార్జీలు, బస్తాల లోడింగ్ తదితర పేర్లతో రైతుల నుంచి అదనపు వసూళ్లు అరికట్టాలి. సేకరణ వివరాలను వెంటదివెంట ఆన్‌లైన్ చేయకపోవడంతో చెల్లింపులు ఆలస్యమవుతున్నాయి. వ్యవసాయ శాఖ పోర్టల్‌లో రైతుల వివరాలు లేకున్నా ఏఈవో ధ్రువీకరణతో కొనుగోలు చేస్తే జాప్యం నివారించవచ్చు. గన్నీ సంచులు కొత్తగా సమకూర్చి సరిపడా సరఫరా చేయాలి. కేంద్రాల నుంచి బస్తాల తరలింపు బాధ్యతలను మిల్లర్లకే అప్పగించి, వారికే రవాణా ఛార్జీలు చెల్లిస్తే సత్ఫలితాలుంటాయి.

జిల్లాలో వరి సాగు: 3.15 లక్షల ఎకరాలు

దిగుబడి అంచనా: 7.50 నుంచి 8 లక్షల మెట్రిక్ టన్నులు

ఏర్పాటు చేయనున్న కొనుగోలు కేంద్రాలు: 421

# తోడేకొద్దీ క్రమాలే..!



కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాల వల్ల నదీగర్భాలు దెబ్బతింటున్నాయి. గోదావరి, కిన్నెరసాని, ముర్రేడు తదితర నదులు, వాగులను కొల్లగొడుతూ ఇసుక మాఫియా విధ్వంసం సృష్టిస్తోంది. ఈ దందా వెనుక అక్రమార్కులే కాదు.. కమీషన్ల మత్తులో కళ్లు మూసుకుంటున్న అధికారులు, ప్రజాప్రతినిధుల హస్తం ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**భవిష్యత్తులో ఎదురయ్యే నష్టాలు**

పరిమితికి మించి ఇసుక తవ్వటం వల్ల నదీగర్భం లోతు పెరిగి పరీవాహక ప్రాంతాలు కోతకు గురవుతాయి. ఇసుక అనేది నీటిని భూమిలోకి ఇంకించే సహజ వడపోత. ఇసుక లేకపోతే భూగర్భజలాలు పడిపోతాయి.

అక్రమార్కుల కృత్రిమ కొరత వల్ల చౌకగా లభించాల్సిన ఇసుక సామాన్యులకు అందుబాటులో లేకుండా పోతోంది.

లక్ష్మీదేవిపల్లి మండలంలో ముర్రేడు, పినపాక మండలం ఏడూళ్లబయ్యారం పెద్దవాగు ఉధృతికి పరీవాహక ప్రాంతాల్లోని అనేక ఇళ్లు నీటిపాలైన విషయం విదితమే.

నిబంధనలకు విరుద్ధంగా..ములకలపల్లిమండలం సీతారాంపురం ఎస్సీకాలనీ శివారులోని ముర్రేడు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఇక్కడి నుంచి ఇసుకను పాల్వంచ పట్టణానికి తరలించి అధిక ధరలకు అమ్మి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు.

పాల్వంచ మండలం తోగ్గూడెం, రంగాపురం, దంతెలబోర ఎస్సీకాలనీ, సంగం నాగారం, పాల్వంచ సమీపంలోని పేటచెరువు గ్రామాల నుంచి రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిపోతోంది. ఆయాచోట్ల అంతర్గత రోడ్లు ఛిద్రమవుతున్నాయి.

బూర్గంపాడు మండలం సోంపల్లి, బుడ్డగూడెం, పినపాక పట్టినగర్ ప్రాంతాల్లో యథేచ్ఛగా తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ మండలం గుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లు, నాలుగు ట్రాక్టర్లను అధికారులు ఇటీవల పట్టుకున్నారు.

టేకులపల్లి, లక్ష్మీదేవిపల్లి, పినపాక తదితర మండలాల్లో వాగులు అక్కడక్కడ ఆనవాళ్లు కోల్పోతున్నాయి.

రీచ్‌ల నుంచి ఇసుక రవాణాకు అనుమతులు ఉన్నప్పటికీ.. వాగులు, వంకల నుంచి నిబంధనలకు విరుద్ధంగా యథేచ్ఛగా తవ్వకాలు జరుగుతున్నప్పుడు సంబంధిత అధికారులు చూసీచూడనట్లు ఎందుకు వ్యవహరిస్తున్నారు?

జిల్లా సరిహద్దు చెక్‌పోస్టుల నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నా.. నిలువరించే శక్తి అధికారులకు లేకపోవటం వెనుక అసలు కారణమేంటి?వాగుల ఒడ్డున, వంతెనలకు అతి సమీపంలో పంటపొలాల పక్కన జేసీబీలతో తవ్వకాలు జరుగుతున్నా.. వాల్టా చట్టాన్ని అమలుచేయటంలో యంత్రాంగం ఎందుకు విఫలమవుతోంది?

పోలీసులు, రెవెన్యూ అధికారుల సహకారంతో ఇసుక అక్రమ రవాణాను అరికడుతున్నాం. ఇటీవల అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలకు భారీగా జరిమానా విధించాం. ప్రతిరోజూ గస్తీ నిర్వహిస్తున్నాం.

దినేష్‌కుమార్, మైనింగ్ ఏడీ

# గుట్ట'నక్కలు..'!

నల్గొండ: భువనగిరి ఐటీఐ కళాశాల సమీపంలో రామకృష్ణాపురం, బీబీనగర్ కొండమడుగు ప్రాంతాల్లో ఉన్న గుట్టలను యంత్రాలతో తొలచి మట్టిని వెంచర్లకు తరలిస్తున్నారు. ఇటీవలే వర్షాలు కురవడంతో ఎఫ్‌టీఎల్ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన వెంచర్లన్నీ జలమయయ్యాయి. నీటిని తొలగించేందుకు మట్టి రాశులు పోయడమే పరిష్కార మార్గంగా భావించి యుద్ధప్రాతిపదికన పొక్లయిన్లు, భారీ డంపర్లు ఏర్పాటు చేసుకుని పని కానిచ్చేస్తున్నారు. స్థానికులు కలెక్టరేట్‌లో ఫిర్యాదులు చేసినప్పటికీ సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదే విషయమై రెవెన్యూ అధికారులను వివరణ అడిగితే తమ పరిధిలో లేదని, భూగర్భ గనుల శాఖాధికారులతో ప్రస్తావించాలని చెబుతున్నారు. జిల్లా భూగర్భ గనుల శాఖాధికారి రాఘవరెడ్డితో ఇదే విషయాన్ని ప్రస్తావించగా.. తమ వద్ద ఎవరూ ఎలాంటి అనుమతులు తీసుకోలేదని పేర్కొన్నారు. వెంచర్ యజమానులు టిప్పర్లతో వందల ట్రిప్పుల మట్టిని తరలించే అవకాశాలున్నాయని కచ్చితంగా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న అక్రమ మట్టి తరలింపు విషయంలో మాత్రం ఎవరూ ఎలాంటి అనుమతులు తీసుకోలేదని స్పష్టం చేశారు.



హైదరాబాద్-జనగామ జాతీయ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మట్టి తరలించే టిప్పర్లు పెద్దఎత్తున వెళుతున్నాయి. వాహన వేగానికి మట్టి బయటకు వచ్చి వాహనదారుల కళ్లలో పడుతోంది.

పెంచికల్‌పహాడ్, రామకృష్ణాపురం పరిసర ప్రాంతాల్లోని కొండల్లో అనుమతుల్లేకుండా కొండలను యంత్రాలతో తవ్వుతూ రాత్రి వేళల్లో లారీల్లో నింపి సమీపంలో ఉన్న వెంచర్లలో డంప్ చేస్తున్నారు.

అక్రమార్కులు ఎలాంటి సీనరేజీ రుసుములు ప్రభుత్వానికి చెల్లించకుండానే యథేచ్ఛగా దందా నిర్వహిస్తున్నా.. అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# ఇసుక రాసులు. ఖజానాకు కాసులు!

కొత్తగూడెం : భద్రాద్రి జిల్లాలోని ఇసుక రీచ్‌లు రాష్ట్ర ఖజానాకు భారీగా ఆదాయాన్ని సమకూర్చుతున్నాయి. క్వారీల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేయటంతో పాటు రీచ్‌ల నిర్వాహకులకు సకాలంలో బిల్లులు చెల్లించటంతో ఈ ఏడాది ఇసుక విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో బిల్లులు చెల్లించకపోవటంతో క్వారీ నిర్వాహకులు అక్రమ రవాణాకు తెరలేపారు. అందుకే రాష్ట్ర ఖజానాకు చేరాల్సిన సొమ్ము అక్రమార్కుల జేబుల్లోకి వెళ్లింది. గత ఇసుక పాలసీలోని లోపాలను కాంగ్రెస్ సర్కారు గుర్తించి వాటి స్థానంలో నూతన విధానాలకు శ్రీకారం చుట్టింది.

**ఐదు నెలలు.. రూ.123 కోట్లు**

గిరిజన సహకార సంఘాల ఆధ్వర్యంలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. కేవలం ఐదు నెలల్లోనే ప్రభుత్వానికి రూ.123కోట్ల ఆదాయం సమకూరింది. 2016 నుంచి ఇప్పటివరకు ఒక ఆర్థిక సంవత్సరం (2022-23)లో జిల్లాలో ఇసుక విక్రయాల ద్వారా వచ్చిన గరిష్ఠ ఆదాయం రూ.136కోట్లు మాత్రమే. ఈ ఏడాది దాన్ని అధిగమించటంతో పాటు రూ.200కోట్లకు పైగా ఆదాయం వస్తుందని టీజీఎండీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. రీచ్‌ల అనుమతుల విషయంలో జాప్యం.. ఆదాయంపై ప్రభావం చూపిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. జిల్లావ్యాప్తంగా మూడు కోట్ల క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వేందుకు వెసులుబాటు ఉన్నప్పటికీ.. ఇప్పటి వరకు 20లక్షల క్యూబిక్ మీటర్లే తవ్వినట్లు లెక్కలు చెబుతున్నాయి.

**వీటిపై దృష్టి సారించాలి..**



ఇసుక తవ్వకాల ద్వారా రాష్ట్ర ఖజానాకు ఆదాయం సమకూరుతున్నా.. ఇసుక లారీల రాకపోకల వల్ల రహదారులు అస్తవ్యస్తంగా తయారవుతున్నాయి. ఇప్పటికే భద్రాచలం-చర్ల, మణుగూరు-ఏటూరునాగారం రోడ్లపై ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. వీటి మరమ్మతులపై దృష్టి సారించటంతో పాటు జిల్లాలో వర్షాకాలం సైతం ఇసుక విక్రయాలు జరిపేలా అనువైన స్థలంలో స్టాక్ పాయింట్ ఏర్పాటుచేయాల్సిన అవసరముంది. గోదావరి పరిసర ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లు ఉండటం వల్ల వాహనాల పార్కింగ్‌కు స్థలం లేక రోడ్లపైనే నిలుపుతున్నారు. దీనివల్ల ఇతర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్టాక్ పాయింట్ ఏర్పాటుచేయటం ద్వారా పార్కింగ్ స్థలం అందుబాటులోకి వస్తుంది. మారుమూల ప్రాంతాల్లోని రోడ్లు దెబ్బతినవు. రీచ్‌ల అనుమతుల విషయంలో జాప్యం జరగడంతో మరికొంత ఆదాయాన్ని కోల్పోయాం. ప్రస్తుతం ఆరు క్వారీల ద్వారా ఇసుక విక్రయాలు జరుగుతున్నాయి. జిల్లాలో స్టాక్ పాయింట్ ఏర్పాటుచేయాలనే ఆలోచన ఉంది. అది కార్యరూపం దాల్చితే వర్షాకాలం సైతం ఇసుక అమ్మకాలు జరపవచ్చు. రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నాం.




## ఇంటికో పారిశ్రామికవేత్త ఉండాలనేది మా లక్ష్యం: సీఎం చంద్రబాబు

కనిగిరి: ఇంటికో పారిశ్రామికవేత్త ఉండాలనేది తమ లక్ష్యమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. రెవెన్యూ సమస్యలు పరిష్కరించే బాధ్యత తనదని పేర్కొన్నారు. ఈ ఏడాది లక్ష మంది మహిళలను వ్యవస్థాపకులుగా తీర్చిదిద్దుతామన్నారు. వినూత్న ఆలోచనలతో కొత్త పరికరాలను విద్యార్థులు తయారుచేయాలని సూచించారు. ప్రకాశం జిల్లా కనిగిరిలోని పెదఈర్లపాడులో సీఎం పర్యటించారు. ఇందులో భాగంగా ఎంఎస్ఎంఈ పార్కును ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 ఎంఎస్ఎంఈ పార్కులకు వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఇవాళ 329 ఎకరాల్లో 15 పారిశ్రామిక పార్కులను సీఎం ప్రారంభించారు. 587 ఎకరాల్లో మిగిలిన 35 ప్రభుత్వ, ప్రైవేటు ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపన చేశారు. బాపట్ల జిల్లా వేటపాలెం మండం నాయునపల్లిలో చేనేత పార్కుకూ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "రాష్ట్రాభివృద్ధిలో ప్రజలను భాగం చేస్తున్నాం. రాజధాని కోసం 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారు. వారు ఇచ్చిన భూమిని అభివృద్ధి చేసి వారికి అప్పగిస్తున్నాం. రాష్ట్రంలోని వనరులను సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి 50 కిలోమీటర్లకు ఒక పోర్టు నిర్మిస్తాం. రాష్ట్రానికి అనేక పెట్టుబడులు తీసుకొచ్చాం. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో ఏపీ బ్రాండ్‌ను మళ్లీ తీసుకొస్తున్నాం. పెట్టుబడులు తీసుకొచ్చి 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నాం. 20 లక్షల ఉద్యోగాలంటే చాలా మంది అవహేళన చేశారు. ఇప్పటికే చాలా కంపెనీలు ముందుకు వచ్చాయి. ఈ వారమంతా పెట్టుబడుల వెల్లువ కొనసాగుతోంది. పెట్టుబడులతో పాటు ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. కష్టపడి పనిచేసే అద్భుత యువత ఏపీలో ఉంది. గత వైకాపా పాలనలో పారిశ్రామికవేత్తలను బెదిరించడంతో వారు పారిపోయారు" అని చంద్రబాబు అన్నారు.

## సీఎంను కలిసిన కేంద్ర బృందం.. తుఫాను నష్టంపై



అమరావతి, నవంబర్ 11: మొంథా తుఫాను నష్టంపై ముఖ్యమంత్రి చంద్రబాబును కేంద్ర బృందం కలిసింది. కేంద్ర హెూంశాఖ సంయుక్త కార్యదర్శి పాసుమీ బసు నేతృత్వంలో సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రితో కేంద్ర బృందం భేటీ అయ్యింది. రాష్ట్రంలో తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బృందం పర్యటించి నష్టాన్ని అంచనా వేసింది. కోనసీమ, తూర్పుగోదావరి, ఏలూరు, కృష్ణా, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో వేర్వేరు ప్రాంతాలను సందర్శించింది. రూ.5,267 కోట్ల మేర తుఫాను నష్టం వాటిల్లినట్టు కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఓ మధ్యంతర నివేదిక ఇచ్చిన విషయం తెలిసిందే. తక్షణ సాయంగా రూ.2,622 కోట్లను మంజూరు చేయాలని కేంద్రాన్ని సర్కార్ కోరింది. రాష్ట్ర వ్యాప్తంగా 443 మండలాల్లోని 3,109 గ్రామాలు మొంథా తుఫాను కారణంగా ప్రభావితం అయ్యాయని కూటమి ప్రభుత్వం పేర్కొంది. దాదాపు 10 లక్షల మంది తుఫాను, భారీ వర్షాలకు ప్రభావితం అయ్యారని నివేదికలో వెల్లడించింది. 9960 ఇళ్లు నీట మునిగాయని, 1.11 లక్షల కుటుంబాలు నిరాశ్రయులయ్యారని సర్కార్ పేర్కొంది. తుఫానుతో పాటు భారీ వర్షం కారణంగా 4566 ఇళ్లు దెబ్బతిన్నాయని స్పష్టం చేసింది. దాదాపు 1.61 లక్షల హెక్టార్లలో పంట దెబ్బతిందని.. 3.27 లక్షల మంది రైతులు నష్టపోయారని కేంద్రానికి నివేదించింది. వ్యవసాయ పంటలతో పాటు ఆక్వా, పశుసంవర్ధకం, చేనేత రంగం కూడా తీవ్రంగా నష్టపోయినట్టు వెల్లడించింది. 4794 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయని, 12,856 విద్యుత్ స్తంభాలు నేల కూలినట్టు స్పష్టం చేసింది. అలాగే 2,318 ట్రాన్సఫార్మర్లు పాడయ్యాయని నివేదికలో పేర్కొంది. మొంథా తుఫాను కారణంగా పంటలు, రహదారులు, ఇళ్లు, ఇతర మౌలిక సదుపాయాలకు రూ.6,384 కోట్ల మేర నష్టం వాటిల్లిందని వెల్లడించింది. తుఫాను వల్ల నష్టపోయిన ప్రజలను ఆదుకునేందుకు 22 జిల్లాల్లో 1.92 లక్షల మందిని రిలీఫ్ క్యాంపులకు తరలించామని వెల్లడించింది. 3.36 లక్షల కుటుంబాలకు రూ.3 వేల చొప్పున తక్షణ ఆర్థిక సాయంగా అందించినట్టు కేంద్ర బృందానికి ప్రభుత్వం తెలియజేసింది.

## సనాతన ధర్మ పరిరక్షణ బోర్డును స్థాపించాల్సిన సమయం ఆసన్నమైంది: పవన్ కల్యాణ్



అమరావతి, నవంబరు11 : సనాతర ధర్మ పరిరక్షణపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సనాతర ధర్మ పరిరక్షణ కోసం ఓ ప్రత్యేక బోర్డు అవసరమని పవన్ కళ్యాణ్ సూచించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ట్వీట్ పెట్టారు డిప్యూటీ సీఎం. ప్రపంచవ్యాప్తంగా హిందూ సమాజానికి, తిరుమల తిరుపతి దేవస్థానం ఒక తీర్థయాత్ర కేంద్రం కంటే ఎక్కువ అని అభివర్ణించారు. తిరుపతి లడ్డూ కేవలం తీపి కాదని.. ఇది ఒక ఉమ్మడి భావోద్వేగమని ఉద్ఘాటించారు. తిరుపతి లడ్డూని అప్యాయంగా స్నేహితులు, కుటుంబ సభ్యులకు పంపిణీ చేస్తామని చెప్పుకొచ్చారు. తిరుపతి లడ్డూని ఇలా అందజేయడం వల్ల హిందువుల సమష్టి విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోందని ఉద్ఘాటించారు. ప్రతి సంవత్సరం దాదాపు 2.5 కోట్ల మంది భక్తులు తిరుమలను సందర్శిస్తారని నొక్కిచెప్పారు. సనాతన భావాలు, ఆచారాలు ఎగతాళి చేస్తే తనకు ఎంతో ఆవేదన కలిగిందని పేర్కొన్నారు. లౌకికతత్వం రెండు వైపులా ఉండాలని సూచించారు. హిందువుల విశ్వాసంపై రక్షణ, గౌరవంపై చర్చించాల్సిన అవసరం ఉందని తెలిపారు. సనాతన ధర్మం అత్యంత పురాతనమైనదని ఉద్ఘాటించారు. నిరంతరం అభివృద్ధి చెందుతున్న నాగరికతలలో సనాతన ధర్మం ఒకటని అభివర్ణించారు. హిందువుల కోసం సనాతన ధర్మ పరిరక్షణ బోర్డును స్థాపించాల్సిన సమయం ఆసన్నమైందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.




తిరుపతి: తిరుమల కల్తీ నెయ్యి కేసులో విచారణను సిట్ వేగవంతం చేసింది. వైకాపా అధికారంలో ఉండగా తితిదే ఈవోగా పనిచేసిన ధర్మారెడ్డిని సిట్ అధికారులు విచారించారు. తిరుపతిలోని సిట్ కార్యాలయంలో విచారణకు ఆయన హాజరయ్యారు.

ధర్మారెడ్డి ఈవోగా ఉన్న సమయంలో పెద్ద ఎత్తున నెయ్యి కల్తీ జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పలు అంశాలపై ఆయన్ను అధికారులు ప్రశ్నిస్తున్నారు.

గతంలో తితిదే ఛైర్మన్‌గా పనిచేసిన వైవీ సుబ్బారెడ్డికి కూడా సిట్ నోటీసులు ఇచ్చి విచారించనున్నట్లు తెలుస్తోంది.

**ధర్మారెడ్డికి తిరుమల లడ్డూ ఇచ్చేందుకు జనసేన నేత యత్నం.. నిరాకరించిన మాజీ ఈవో...** తిరుమల కల్తీ నెయ్యి కేసు విచారణను సిట్ వేగవంతం చేసింది. వైకాపా అధికారంలో ఉండగా.. తితిదే ఈవోగా పనిచేసిన ధర్మారెడ్డిని సిట్ అధికారులు విచారించారు. అలిపిరి వద్దనున్న సిట్ కార్యాలయంలో ఆయన విచారణకు హాజరయ్యారు.

కల్తీ నెయ్యి కొనుగోలు వ్యవహారంపై సిట్ డీఐజీ మురళి లాంబ ధర్మారెడ్డిని విచారించారు. గతంలో తితిదే ఛైర్మన్‌గా పనిచేసిన వైవీ సుబ్బారెడ్డికి సిట్ నోటీసులు ఇచ్చింది. ఈనెల 13న విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొంది. ఈనెల 15 తర్వాత విచారణకు హాజరవుతానని.. మరో వారం గడువు కావాలని సుబ్బారెడ్డి.. సిట్ అధికారులను అడిగినట్టు తెలుస్తోంది. ధర్మారెడ్డి విచారణ ముగిసిన తర్వాత మీడియాతో మాట్లాడేందుకు యత్నించగా.. అక్కడికి వచ్చిన జనసేన నేత కిరణ్ రాయల్.. ఆయనకు తిరుమల లడ్డూ ఇచ్చేందుకు ప్రయత్నించారు. లడ్డూ తీసుకునేందుకు ధర్మారెడ్డి నిరాకరించారని కిరణ్ రాయల్ ఆరోపించారు.

## సీఐఐ భాగస్వామ్య సదస్సుకు విశాఖ ముస్తాబవుతోంది: మంత్రి లోకేశ్



అమరావతి: ఈ నెల 14-15 తేదీల్లో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు 'సిటీ ఆఫ్ డెస్టినీ' విశాఖపట్నం ముస్తాబవుతోందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. రహదారుల అభివృద్ధి, తీరప్రాంత సుందరీకరణ, కొత్త ల్యాండ్‌స్కేప్ పనులు అన్నీ వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించడానికి, చిరస్థాయి ముద్ర వేయడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఈ మేరకు ఓ వీడియోను లోకేశ్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. రెండు రోజుల పాటు జరిగే సదస్సులో 37 ప్లీనరీ సెషన్లు.. 5 కంట్రీ సెషన్లను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుంది. వివిధ దేశాల ప్రతినిధులు, పలు ప్రముఖ కంపెనీల సీఎక్స్‌వోలు, ఆర్థిక నిపుణులు అందులో పాల్గొననున్నారు.

వివిధ దేశాల్లో వాణిజ్యానికి ఉన్న అవకాశాలపై చర్చిస్తారు. ప్రారంభ, ముగింపు కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. వివిధ విభాగాలకు సంబంధించి 410 ఒప్పందాలను ప్రభుత్వం కుదుర్చుకోనుంది. వాటి ద్వారా సుమారు రూ.9.76 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వస్తాయని అంచనా.




## ఇకపై ఏపీ ప్రజలకూ నేను మామనే: కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్

గుంటూరు: ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కలయిక అద్భుతమని కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అన్నారు. ఆ ముగ్గురూ కలిసి రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు. గుంటూరు జిల్లా వెంగళాయపాలెం చెరువు వద్ద వాటర్‌షెడ్ పథకం కింద రూ.1.20కోట్లతో చేపట్టిన పనులను కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలతో కలిసి ఆయన పరిశీలించారు. తొలుత శివరాజ్‌సింగ్‌తో కలిసి పెమ్మసాని చంద్రశేఖర్, కందుల దుర్గేష్ పూజలు చేశారు. అనంతరం పైలాన్‌ను కేంద్రమంత్రులు ఆవిష్కరించారు. ఆ తర్వాత అక్కడ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా శివరాజ్‌సింగ్ మాట్లాడారు. "వెంగళాయపాలెం చెరువు పునరుద్ధరణ చూశాక నాకు చాలా సంతోషం వేసింది. పురాతన చెరువును అత్యాధునికంగా తీర్చిదిద్దారు. దీని ద్వారా ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరుగుతాయి. పశువులకు తాగునీరు లభిస్తుంది. మత్స్య సంపద పెంచడానికి, బోటింగ్ సౌకర్యానికి చెరువును ఉపయోగించవచ్చు. వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, ఓపెన్ థియేటర్ వంటివి ప్రజలకు ఆనందాన్ని ఆరోగ్యాన్ని పంచుతాయి. తక్కువ ఖర్చుతో ఇన్ని సౌకర్యాలు కల్పించిన పెమ్మసాని చంద్రశేఖర్, బూర్ల రామాంజనేయులకు అభినందనలు.

దిల్లీ పేలుళ్ల ఘటనలో మృతిచెందిన వారికి ఈ వేదిక నుంచి నివాళులర్పిస్తున్నా. కేంద్రమంత్రి హెూదా కంటే ప్రజలకు సేవ చేయడం కోసమే ఇక్కడికి వచ్చా. ప్రజా సేవ దైవ పూజగా భావిస్తా. మధ్యప్రదేశ్‌లో ప్రజలు నన్ను మామ అంటారు. ఇకపై ఏపీ వారికి కూడా నేను మామనే. దేశవ్యాప్తంగా ఇదే తరహాలో చెరువుల పునరుద్ధరణ చేస్తామని మాటిస్తున్నా" అని శివరాజ్‌సింగ్ చౌహాన్ అన్నారు.




కంకిపాడు రూరల్: కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం గండిగుంట సమీపంలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది . కారు అదుపు తప్పి జాతీయరహదారి పైనుంచి సర్వీసు రోడ్డులోకి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో విజయవాడ, కుందేరు గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలవడంతో ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.




నెల్లూరు: నెల్లూరులో కంటైనర్ లారీ బీభత్సం సృష్టించింది. చేపల లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి.. మినీ వ్యాను, 3 బైక్‌లతో పాటు ఓ చెట్టును ఢీకొట్టింది.

ఈ ప్రమాదంలో ముగ్గురు మృతిచెందగా.. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. నెల్లూరులోని ఎన్టీఆర్ నగర్ వద్ద జాతీయ రహదారిపై ఈ ఘటన చోటుచేసుకుంది. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. చెన్నై నుంచి విజయవాడవైపు వెళున్న కంటైనర్ లారీ నియంత్రణ కోల్పోవడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. మృతులను నజీమ్ మొహిద్దీన్ (67), షేక్ ముజాహిద్ అలీ (36), వి. సురేశ్ (36) గా గుర్తించారు. వీళ్లంతా నెల్లూరు రూరల్‌లోని సిరి గార్డెన్‌కు చెందినవారు.

సంఘటన స్థలికి చేరుకున్న పోలీసులు రహదారిపై వాహనాలను తొలగించి.. రాకపోకలను పునరుద్ధరించారు. జిల్లా ఎస్పీ అజిత్ సంఘటన స్థలిని పరిశీలించారు. లారీ ముందు భాగం చెట్టుకు తగలడంతో నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంపై మంత్రి నారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు.

## అన్ని జిల్లాల సమాన అభివృద్ధికి కృషి: మంత్రి నారాయణ



కాకినాడ, నవంబర్ 11: జిల్లాలో మంత్రి నారాయణ పర్యటన కొనసాగుతోంది. ఈ సందర్భంగా పలు పరిశ్రమల ఏర్పాటుకు మంత్రి శంకుస్థాపన చేశారు. కాకినాడ పోర్టులో ఎమ్ఏటీ మెరైన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ విస్తరణ,పెద్దాపురంలో సంతోషిమాత కారుగేటర్స్ పరిశ్రమ, తునిలో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ల ఏర్పాటుకు శిలాఫలకాలు ఆవిష్కరించారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఎవరూ ముందుకు రాలేదని.. ఇక్కడ ఉన్న పారిశ్రామికవేత్తలు కూడా ఇతర రాష్ట్రాలకు తరలిపోయారని అన్నారు. పెట్టుబడిదారులు రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ సరిగా ఉందో లేదో ముందుగా చూసుకుంటారని తెలిపారు. గత ఐదేళ్లలో ఏపీలో అరాచక పాలన ఉందని విదేశీ పెట్టుబడిదారులు చెప్పారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం 20 లక్షల ఉద్యోగాల కల్పన కోసం ముందుకెళున్నామని అన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ కూడా పెట్టుబడుల కోసం విదేశాలకు వెళ్లి వచ్చారని తెలిపారు. రాష్ట్రంలో 10 లక్షల కోట్ల పెట్టుబడుల ద్వారా 7.5 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చేలా పారిశ్రామిక వేత్తలతో ఒప్పందాలు జరుగనున్నాయన్నారు. రాష్ట్ర భవిష్యత్తుకు పరిశ్రమలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బదులు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో సీఎం ముందుకెళ్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలను సమానంగా అభివృద్ధి చేసేలా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని చెప్పారు. పరిశ్రమలకు అనుకూలంగా ఉండేలా పాలసీలు తీసుకొచ్చి సబ్సిడీలు కూడా ఇస్తున్నామన్నారు. కాకినాడ జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నాయని.. కాకినాడ పోర్టు అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యే కొండబాబు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు.

## సంస్కరణలతో దేశ విద్యా వ్యవస్థకు పునాది వేశారు.. మౌలానా ఆజాద్‌కి నివాళి అర్పించిన చంద్రబాబు, లోకేష్




అమరావతి, నవంబరు11 : స్వాతంత్ర్య సమరయోధులు, దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా పలువురు ప్రముఖులు నివాళి అర్పిస్తున్నారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడుతున్నారు. ఈ క్రమంలోనే మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కి నివాళి అర్పించారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ట్వీట్ పెట్టారు.

## లెహంగాలో కట్టిపడేస్తున్న అనన్య పాండే.. ప్రత్యేకత ఏమిటంటే?

కొన్నిసార్లు మనకు మనం వేసుకునే బట్టలు విపరీతమైన అందాన్ని తీసుకొస్తాయి. ఈ విషయాన్ని అందరూ ఒప్పుకోకపోవచ్చు. కానీ అదే వాస్తవం. పవన్ కళ్యాణ్ ఎన్ని సినిమాలు చేసినా ఖుషి సినిమాలోనే ఎక్కువ అందంగా ఎందుకు కనిపిస్తారు అంటే పవన్ కళ్యాణ్ వేసుకున్న కాస్ట్యూమ్స్. ఆ సినిమాకి కాస్ట్యూమ్ డిజైనర్ గా పని చేశారు రేణు దేశాయ్. అయితే ఆ సినిమాలో పవన్ కళ్యాణ్ ని చూస్తుంటే తమ భర్తను ఎలా చూపించాలో తన భార్యకు బాగా తెలుసు అని ఫీలింగ్ కలిగింది. అలానే సమంత ఎన్ని సినిమాలు చేసినా కూడా ఏం మాయ చేసావే సినిమాలో తన కాస్ట్యూమ్స్ అదిరిపోతాయి. సింపుల్గా అందంగా కనిపించేటట్లు ఆ సినిమా కాస్ట్యూమ్స్ ఉంటాయి. చాలా సందర్భాల్లో కాస్ట్యూమ్స్ మాత్రమే మంచి బ్యూటీ ను తీసుకొస్తాయి. కొన్ని పీరియాడిక్ సినిమాల్లో కూడా కాస్ట్యూమ్స్ అనేవి కీలకపాత్రను పోషిస్తాయి. అయితే చాలామంది సెలబ్రిటీలు కేవలం సినిమాల్లో మాత్రమే కాకుండా బయట కనిపించేటప్పుడు అద్భుతమైన కాస్ట్యూమ్స్ వేసుకుంటారు. తాజాగా సోషల్ మీడియాలో అనన్య పాండే ఫోటోలు వైరల్ గా మారాయి. అనన్య పాండే వేసుకున్న లెహంగాతో



ఒక్కసారిగా అందరి దృష్టిని ఆకట్టుకుంది. ప్రస్తుతం కుర్రకారు సైతం కామెంట్స్ తో పొగడడం మొదలుపెట్టారు. అయితే ఈ లెహంగాను భూమికా శర్మ డిజైన్ చేశారు. ఇది దాదాపు 1.1 లక్షలని తెలుస్తుంది. అయితే కాస్ట్ కూడా ఆ లుక్ లో కనిపిస్తుంది. ఆ లెహంగాను అనన్య పాండే ధరించిన తర్వాత ఆ రిచ్ ఫీలింగ్ కచ్చితంగా కలుగుతుంది. అందులో భాగంగానే ఇప్పుడు అద్భుతమైన లెహంగా ధరించి అందరిని ఆకట్టుకుంది. గ్రీన్ గోల్డెన్ కలర్ కాంబినేషన్లో ఉన్న ఈ లెహంగాపై వైట్ కలర్ ఎంబ్రాయిడరీ తో చాలా చక్కగా డిజైన్ చేశారు. ఒక ఈవెంట్ లో భాగంగా గ్లామర్ తో ఆకట్టుకున్న ఈమె మరొకవైపు ఇలా ట్రెండీ ఔట్ఫిట్ లో కనిపించి అభిమానులను అలరించింది. తాజాగా అనన్య పాండే ఫోటోలు వైరల్ గా మారుతున్నాయి. అనన్య పాండే విషయానికి వస్తే.. హిందీలో చాలా సినిమాలు చేసింది.

పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ నటించిన లైగర్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు కూడా పరిచయం అయింది. బాక్స్ ఆఫీస్ వద్ద లైగర్ సినిమా ఊహించని ఫలితాన్ని అందుకోలేక పోయింది. అందుకని తెలుగులో మళ్లీ అనన్యకు అవకాశాలు రాలేదు. లైగర్ సినిమా సక్సెస్ అయి ఉంటే మన తెలుగు దర్శకులు అనన్య వెంటపడేవాళ్లు. తెలుగులో పెద్దగా సినిమాలు చేయకపోయినా కూడా చాలామంది తెలుగు యువత ఆమెను సోషల్ మీడియా వేదికలో ఫాలో అవుతూ ఉంటారు. తన ఇన్‌స్టాగ్రామ్ పోస్టులతో కూడా చాలామంది అభిమానులకు దగ్గరగా ఉంటుంది అనన్య.

## మన శంకరవరప్రసాద్ గారు మెయిన్ హైలైట్ అదే!

మెగాస్టార్ చిరంజీవి హీరోగా టాలీవుడ్ హిట్ మిషన్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా మన శంకరవరప్రసాద్ గారు. సంక్రాంతికి వస్తున్నాం సినిమా బ్లాక్ బస్టర్ తర్వాత అనిల్ రావిపూడి నుంచి వస్తున్న సినిమా కావడంతో పాటూ చిరంజీవితో అనిల్ చేస్తున్న మొదటి మూవీ కావడంతో ఈ మూవీపై మొదటి నుంచి భారీ అంచనాలున్నాయి.

**మొదటిసారి స్క్రీన్ షేర్ చేసుకోనున్న చిరూ, అనిల్...** ఆ అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా అనిల్ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. అందులో భాగంగానే చిరంజీవి సరసన ఏకంగా లేడీ సూపర్ స్టార్



నయనతారను హీరోయిన్ గా ఎంపిక చేసిన అనిల్, ఈ సినిమాలో విక్టరీ వెంకటేష్ తో క్యామియో రోల్ చేయిస్తున్నారు. చిరూ, వెంకీ కలిసి మొదటిసారి స్క్రీన్ షేర్ చేసుకోనున్నారని తెలిసనప్పటి నుంచి ఈ మూవీపై ఆడియన్స్ కు ఎగ్జైట్‌మెంట్ బాగా పెరిగింది.

**శంషాబాద్ లో జరుగుతున్న షూటింగ్...** శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న మన శంకరవరప్రసాద్ గారు 2026 సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే పలు షెడ్యూళ్ల షూటింగ్ పూర్తి కాగా, రీసెంట్ గానే తాజా షెడ్యూల్ లో విక్టరీ వెంకటేష్ కూడా పాల్గొన్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శంషాబాద్ లోని రాజ్ ప్యాలెస్ లో జరుగుతుండగా, శనివారం రోజు చిరంజీవి, వెంకటేష్ తో కాంబినేషన్ సీన్ ను షూట్ చేశారని, మన శంకరవరప్రసాద్ గారులో ఈ ఎపిసోడ్ మెయిన్ హైలైట్ గా నిలవనుందని యూనిట్ సభ్యులు చెప్తున్నారు.

**మీసాల పిల్ల సాంగ్ కు అద్భుతమైన రెస్పాన్స్...** ఇదిలా ఉంటే ఈ సినిమా నుంచి రీసెంట్ గా మీసాల పిల్ల అనే ఫస్ట్ లిరికల్ రిలీజవగా, ఆ సాంగ్ కు ఆడియన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. మీసాల పిల్ల సాంగ్ ఆల్రెడీ 50 మిలియన్ల వ్యూస్ ను దాటి దేశవ్యాప్తంగా రికార్డు సృష్టించింది.

భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న ఈ సాంగ్ లో చిరంజీవి తన సిగ్నేచర్ మూమెంట్స్ తో పాటూ మంచి ఎక్స్‌ప్రెషన్స్, ఎనర్జిటిక్ డ్యాన్సులతో ఆడియన్స్ ను అలరించారు.




## శృతిహాసన్ మొదలు ఇమాన్వీ వరకూ.. ప్రభాస్ ఇంటి భోజనాన్ని రుచి చూసిన హీరోయిన్స్ వీళ్ళే!



ఇండస్ట్రీలో ప్రభాస్ క్రేజ్ గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. బాహుబలి సినిమా తర్వాత ప్రపంచవ్యాప్తంగా ప్రభాస్ కు మంచి గుర్తింపు లభించింది. ఇప్పుడు ప్రభాస్ నుంచి ఒక సినిమా వస్తుంది అంటే ప్రపంచవ్యాప్తంగా ఆడియన్స్ ఎదురు చూస్తుంటారు అని చెప్పటంలో అతిశయోక్తి లేదు. ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నాడు ప్రభాస్. ప్రస్తుతం చేస్తున్న ప్రతి ప్రాజెక్టు కూడా పాన్ ఇండియా రేంజ్ లోనే విడుదలవుతుంది. ప్రభాస్ టాలెంట్ గురించి.. ఆల్రెడీ సినిమాలు ప్రూవ్ చేసే దాని గురించి కొత్తగా చెప్పాల్సిన అవసరం ఏమీ లేదు. అలానే ప్రభాస్ సినిమాలు, ప్రభాస్ క్యారెక్టర్ ఎంత పాపులర్ అయిందో ప్రభాస్ ఫుడ్ కూడా అంతే పాపులర్ అయింది. చాలామంది సెలబ్రిటీలు ప్రభాస్ ఇంట్లో ఫుడ్ గురించి మాట్లాడుతూ ఉంటారు. ఎవరు చూడని వెరైటీ ఫుడ్స్ ను అందరికీ రుచి చూపిస్తుంటాడు ప్రభాస్. ప్రభాస్ తో పని చేయటం అనేది ఒక అదృష్టం అని ఇప్పటికే చాలామంది దర్శకులు కూడా చెబుతూ ఉంటారు.

**శృతిహాసన్ నుంచి ఇమాన్వి వరకు...** ప్రభాస్ అందరికీ అద్భుతమైన ఫుడ్ పెడతాడు అని ఇప్పటివరకు అతనితో పని చేసిన చాలా మంది తెలిపారు. గతంలో సలార్ సినిమాకి పని చేసినప్పుడు కూడా శృతిహాసన్ తన ఫుడ్ గురించి చాలా మాటలు చెప్పారు. రాజా సాబ్ సినిమా చేస్తున్నప్పుడు నిధి అగర్వాల్, అలానే మాళవిక మోహనన్ కూడా ప్రభాస్ ఫుడ్ వీడియోలను అప్పట్లో సోషల్ మీడియాలో కూడా పోస్ట్ చేశారు. పృధ్వీరాజ్ సుకుమారన్ కూడా చాలా సందర్భాల్లో ఈ విషయాన్ని చెప్పాడు. దేవుడు ఏదైనా వరం అందిస్తే ప్రభాస్ చెఫ్ ను కిడ్నాప్ చేయాలి అనే కోరికను చెప్పే వాళ్ళు కూడా ఉన్నారు. ప్రస్తుతం ప్రభాస్ హను రాఘవపూడి దర్శకత్వంలో ఫౌజీ అనే సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా మీద విపరీతమైన అంచనాలు ఉన్నాయి. సీతారామం వంటి సక్సెస్ఫుల్ సినిమా తర్వాత హను ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో ఇమాన్వి హీరోయిన్ గా నటిస్తున్న సంగతి తెలిసిందే. అలవాటు ప్రకారం తాజాగా ఇమాన్వికి కూడా ప్రభాస్ ఫుడ్ పంపించారు. ఈ విషయాన్ని స్వయంగా ఇమాన్వి ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో యాడ్ చేశారు. ఇమాన్వి కోసం చాలా వెరైటీ వంటలను తయారు చేయించారు ప్రభాస్.

హార్ట్ మరియు కడుపు నిండిపోయింది థాంక్యూ ప్రభాస్ గారు అంటూ ఇమాన్వి వీడియో షేర్ చేస్తూ రాసుకొచ్చారు. ప్రభాస్ ఫుడ్ గురించి చాలామంది సెలబ్రిటీలు ఇలా వీడియోలు పెడుతూ ఉంటే ఇప్పటివరకు ప్రభాస్ తో పని చేయని చాలా మందికి కనీసం ఫుడ్ కోసమైనా ప్రభాస్ తో పని చేయాలి అనే కోరిక కలిగించేలా ఉన్నాయి. ఇది వినడానికి హాస్యాస్పదంగా అనిపించినా కూడా అక్కడక్కడా ఇటువంటి కామెంట్స్ కూడా వినిపిస్తున్నాయి.

## ఆ విషయంలో వెనుకంజలో ఉన్న రాజా సాబ్



సంక్రాంతి పండగ అంటే ఎన్నో సెలవులుంటాయి. ఆ సీజన్ లో సినిమాలు రిలీజ్ చేస్తే మామలూ రోజుల్లో ఒకటి లేదా రెండు టికెట్లు తెగితే సంక్రాంతి సీజన్ లో మాత్రం ఫ్యామిలీ మొత్తం టికెట్లు తెగుతాయి.

అందుకే ఎంతోమంది దర్శకనిర్మాతలు, హీరోలు తమ సినిమాలను సంక్రాంతికి రిలీజ్ చేయాలని టార్గెట్ గా పెట్టుకుంటూ ఉంటారు. దాని కోసం పోటీకి కూడా రెడీ అవుతారు.

**2026 సంక్రాంతికి భారీ పోటీ...** ఎప్పటిలానే ఈ సంక్రాంతికి కూడా పోటీ భారీగా నెలకొంది. ఈసారి సంక్రాంతి రేసులో ది రాజా సాబ్, మన శంకరవరప్రసాద్ గారు, జన నాయగన్ లాంటి భారీ సినిమాలు రిలీజ్ కానున్నాయి. వాస్తవానికి రాజా సాబ్ డిసెంబర్ లో రావాల్సింది కానీ సంక్రాంతికి రిలీజ్ చేస్తే తమ సినిమా ఇంకా బాగా పెర్ఫార్మ్ చేయడంతో పాటూ మంచి కలెక్షన్లను రాబట్టుకోవచ్చని రిలీజ్ ను సంక్రాంతికి మార్చుకున్నారు మేకర్స్.

**చిరూ మూవీ నుంచి మీసాల పిల్ల భారీ హిట్...** ఇక చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న మన శంకరవరప్రసాద్ గారు అందరి కంటే ముందుగా తమ సినిమాను 2026 సంక్రాంతికి రిలీజ్ చేస్తామని అనౌన్స్ చేశారు. చెప్పినట్టుగానే అనిల్ తన సినిమాను సంక్రాంతికి దింపడానికి రెడీ చేస్తున్నారు. ఆల్రెడీ మూవీ నుంచి మీసాల పిల్ల అనే ఫస్ట్ సింగిల్ ను కూడా రిలీజ్ చేసి దాన్ని భారీ హిట్ ను చేశారు.

**ఇంకా మొదలవని రాజా సాబ్ ప్రమోషన్స్...** దళపతి విజయ్ హీరోగా వస్తోన్న ఆఖరి సినిమా జననాయగన్ కూడా సంక్రాంతికి రిలీజ్ కానుండగా, ఇప్పటికే మేకర్స్ ఈ మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ ను రిలీజ్ చేశారు. కానీ ప్రభాస్– మారుతి కాంబినేషన్ లో వస్తోన్న రాజా సాబ్ నుంచి మాత్రం మేకర్స్ ఇంకా ఎలాంటి సాంగ్ ను రిలీజ్ చేయలేదు. రిలీజ్ చేద్దామని రెండు మూడు సార్లు ప్లాన్ చేసినప్పటికీ అది కుదరలేదు. ఓవైపు పోటీలో ఉన్న సినిమాలు ఇప్పటికే తమ సినిమాల్లోని ఫస్ట్ సాంగ్ ను రిలీజ్ చేసుకుని ప్రమోషన్స్ ను మొదలుపెడితే రాజా సాబ్ మాత్రం ఇంకా సాంగ్ రిలీజ్ చేయకుండా, ప్రమోషన్స్ ను స్టార్ట్ చేయకుండా ఉన్నారు. ఈ విషయంపై ఫ్యాన్స్ భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఆల్రెడీ రాజా సాబ్ నుంచి ట్రైలరే వచ్చిందని, సాంగ్స్ కూడా ఆల్రెడీ రెడీగా ఉన్నాయని, వాటన్నింటినీ ఓ ప్లాన్ ప్రకారం రిలీజ్ చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారని కొందరంటుంటే, మరికొందరు మాత్రం రిలీజ్ దగ్గర పడుతున్నప్పటికీ ఇంకా ఫస్ట్ సాంగ్ కూడా రిలీజ్ చేయకపోవడమేంటని నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఎలా చూసుకున్నా ఇప్పటికైతే సంక్రాంతి రేసులో ఉన్న సినిమాలతో పోలిస్తే రాజా సాబ్ స్పీడు పెంచాల్సిన అవసరం ఉందనిపిస్తుంది.

## మృణాల్ చేతిలో అదొక్కటే.. రీజన్స్ ఏంటి..?

బాలీవుడ్ లో సీరియల్స్ చేసి ఆ క్రేజ్ తో సిల్వర్ స్క్రీన్ ఛాన్స్ లు అందుకున్న మృణాల్ ఠాకూర్ తెలుగులో సీతారామం సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. హను రాఘవపూడి డైరెక్షన్ లో తెరకెక్కిన సీతారామం సినిమా సూపర్ హిట్ అవ్వడంతో మృణాల్ ఠాకూర్ కి తెలుగులో మంచి పాపులారిటీ వచ్చింది. ఆ నెక్స్ట్ నానితో హాయ్ నాన్న చేసి మెప్పించింది మృణాల్ ఐతే థర్డ్ ప్రయత్నంగా విజయ్ దేవరకొండతో ఫ్యామిలీ స్టార్ సినిమా చేసింది కానీ అది వర్క్ అవుట్ అవ్వలేదు. 3 సినిమాలు తీస్తే రెండు హిట్లు ఒక ఫ్లాప్ పడగా అయినా కూడా మృణాల్ కి తెలుగులో సరైన అవకాశాలు రావట్లేదు.

**మృణాల్ ఠాకూర్ చేతిలో ఒకే ఒక్క సినిమా..** నిజంగానే మృణాల్ కి ఛాన్స్ లు రావట్లేదా ఒకవేళ వచ్చినా ఆమె కాదంటుందా అన్నది తెలియదు కానీ మృణాల్ ఠాకూర్ చేతిలో ఒకే ఒక్క తెలుగు సినిమా ఉంది. అది కూడా ముందు ఒక హీరోయిన్ తో ఆ ప్రాజెక్ట్ అనుకుని టీజర్ కూడా చేశాక మధ్యలో ఆ హీరోయిన్ హ్యాండ్సప్ చెప్పడంతో



మృణాల్ కి ఛాన్స్ దక్కింది. ఒకవేళ ఆ హీరోయిన్ కొనసాగి ఉంటే ఆ అవకాశం కూడా ఉండేది కాదు. మృణాల్ ఠాకూర్ డెకాయిట్ సినిమా నెక్స్ట్ ఇయర్ మార్చిలో రిలీజ్ అవుతుంది. ఈ సినిమాతో పాటు అల్లు అర్జున్ అట్లీ కాంబో సినిమాలో ఒక రోల్ చేస్తుందని వార్తలు వస్తున్నాయి కానీ అది అఫీషియల్ అనౌన్స్ మెంట్ రాలేదు. ఐతే తెలుగులో పరిస్థితి ఇలా ఉండగా ఇంకా బాలీవుడ్ లో మృణాల్ తన ప్రయత్నాలు చేస్తూనే ఉంది. అక్కడ స్టార్ అవ్వాలన్న తన కల కోసం మృణాల్ ఎలాంటి ఆఫర్ వచ్చినా కాదనకుండా చేస్తుంది.

**టాలీవుడ్ మీదే మృణాల్ ఫోకస్..** హిందీలో సినిమాలు చేస్తున్నా కూడా తన ఫోకస్ అంతా టాలీవుడ్ మీదే మృణాల్ పెట్టింది. అందుకే ఇక్కడ ఏ సినిమా ఛాన్స్ వచ్చినా కాదనకుండా చేయాలని చూస్తుంది. తెలుగులో చేసిన 3 సినిమాల్లో రెండు సక్సెస్ అయినా కూడా మృణాల్ ఠాకూర్ ని ఎవరు పట్టించుకోవట్లేదు. ఐతే ఆడియన్స్ మాత్రం మృణాల్ కి మళ్లీ మళ్లీ అవకాశాలు ఇవ్వాలని కోరుతున్నారు. ప్రస్తుతం అడివి శేష్ డెకాయిట్ ఒక్కటే ఆమె చేస్తుండగా ఆ సినిమా రిలీజ్ తర్వాత ఏమైనా మృణాల్ కి అవకాశాలు వస్తాయేమో చూడాలి. మృణాల్ మాత్రం తన హోప్స్ ని వదులుకోకుండా మంచి అవకాశం కోసం ఎదురుచూస్తూనే ఉంది. తెలుగు, హిందీతో పాటు తమిళంలో కూడా తన ఎంట్రీ ఇవ్వాలని చూస్తుంది మృణాల్. కాకపోతే అమ్మడికి అక్కడ నుంచి ఛాన్స్ లు రావట్లేదు. తెలుగులో మాత్రం మృణాల్ ఎలాంటి సినిమా అయినా చేసి తీరుతా అని కాన్ఫిడెంట్ గా చెబుతుంది.

## హిట్ తో సెకెండ్ ఇన్నింగ్స్ సాధ్యమేనా?

స్టార్ హీరోలతో ఛాన్సులందుకుని మరీ హీరోయిన్ గా నిలదొక్కుకోలేకపోయిన మరో నటి అను ఇమ్మాన్యుయేల్. దేశాలు దాటి అమ్మడు స్టార్ హీరోయిన్ అవ్వాలని టాలీవుడ్ కి వచ్చింది. అమ్మడు అందం, అభినయంతో మంచి అవకాశాలే అందుకుంది. టాలీవుడ్, కోలీవుడ్, మాలీవుడ్ ఇలా మూడు భాషల్ని టచ్ చేసింది.

కానీ ఎక్కడా నిలదొ క్కుకోలేదు. అప్పటి కప్పుడు అవకాశం వచ్చిందా? నటించానా? లేదా? అన్నట్లే కెరీర్ సాగించింది. ఇప్పుడు అవకాశాలు లేక ఖాళీగా ఉంటుంది. అమ్మడు హీరోయిన్ గా సినిమా చేసి మూడేళ్లు అవుతుంది.

**విజయంతో ప్రత్యేకమైన గుర్తింపు:** చివరిగా తమళ్ లోజపాన్ లో నటించిగా, తెలుగులో ఊర్వశివో రాక్షసివోలో నటించింది. ఆ తర్వాత మళ్లీ తెలుగు సినిమా చేయలేదు. ఆమె స్థానాన్ని కొత్త నటీమణులు ఆక్రమించడంతో? అవకాశాలకు పూర్తిగా దూరమైంది. ఇటీవలే రిలీజ్ అయిన దిగర్ల్ ఫ్రెండ్ లో మాత్రం దుర్గ అనే పాత్రలో నటించింది. సినిమాలో పోషించింది చిన్న పాత్రే అయినా? సినిమా విజయం సాధించడంతో సక్సెస్ లో భాగంగా మారింది.




అమ్మడికిది సెకెండ్ ఇన్నింగ్స్ అనే చెప్పాలి. ఒకసారి గెస్ట్ రోల్స్, కామియో పాత్రలు మొదలు పెట్టిన తర్వాత తిరిగి హీరోయిన్ అవకాశాలు అందుకోవడం అన్నది దాదాపు అసాధ్యం.

**సక్సెస్ ఇచ్చిన కిక్ లో:** ఏ పరిశ్రమలోనూ హీరోయిన్ అవకాశాలు కష్టం. ఈ నేపథ్యంలో సొగసరి సెకెండ్ ఇన్నింగ్స్ ను జాగ్రత్తగా ప్లాన్ చేసుకోవడమే ముఖ్యం. గర్ల్ ఫ్రెండ్ లో పోషించిన పాత్ర పెద్ద విజయం సాధించడంతో అమ్మడు ఎంతో షంతోషంగా ఉంది. తన మాటల్లోనే సక్సెస్ ఇచ్చిన కిక్ ఎలా ఉంటుంది? అన్నది అర్ధమైంది.

ది గర్ల్‌ఫ్రెండ్ నాకు ఎప్పుడూ ప్రత్యేకమే. దుర్గ పాత్ర నిడివి తక్కువే అయినా? అది నాకు అరుదుగా లభించే పరిపూర్ణమైన సంతృప్తిని ఇచ్చింది. ఆ పాత్రలో నిశ్శబ్దమైన బలం ఉంది. మాటల కన్నా మౌనంతోనే ఎక్కువగా మాట్లాడే తత్వం అది.

**ఆ పాత్రతో ప్రత్యేకమైన గుర్తింపు:** ఆ పాత్రకు జీవం పోసే క్రమంలో, నాలో నేను కూడా ఒక కొత్త కోణాన్ని కనుగొన్నాను అంటూ ఇన్‌స్టాలో రాసు కొచ్చింది. అలాగే చిన్నపాటి సెటైర్ కూడా అందులోనే విసిరింది. మహిళల పాత్రలను నిజాయతీగా, లోతుగా రాసి నందుకు టీమ్ కు ధన్యవాదాలు తెలిపింది. పాత్రలో నటించేటప్పుడు అక్షరాలా తన చేయి పట్టుకుని నడి పించారంది. ప్రతి సంభాషణా ఎంతో అద్భుతంగా అనిపించిందంది. గతంలో తాను పోషించిన హీరోయిన్ల పాత్రల కంటే చిన్న పాత్ర అయినా ఈ సినిమా ద్వారా వచ్చిన గుర్తింపును చెప్పకనే చెప్పింది. మరి అమ్మడి సెకెండ్ ఇన్నింగ్స్ ఈ పాత్ర ఎంత వరకూ సహకరిస్తుందో చూడాలి.




హైదరాబాద్: ప్రముఖ కవి, రచయిత అందె శ్రీ ప్రస్థానం ముగిసింది. ఘట్‌కేసర్‌లోని ఎన్ఎఫ్‌సీ నగర్‌లో ప్రభుత్వ అధికారిక లాంఛనాల నడుమ అందె శ్రీ అంత్యక్రియలు ముగిశాయి. సీఎం రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు అందె శ్రీ అంతిమయాత్రలో పాల్గొని నివాళులర్పించారు. సీఎం రేవంత్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్వయంగా అందె శ్రీ పాడె మోసి కన్నీలు వీడ్కోలు పలికారు. అందరూ మౌనం పాటించగా.. గౌరవ సూచికంగా పోలీసులు గాల్లోకి మూడు రౌండ్ల కాల్పులు జరిపారు. అనంతరం అందె శ్రీ పార్థివదేహాన్ని సమాధి చేశారు. అంతకుముందు.. లాలాపేట్ నుంచి తార్నాక, ఉప్పల్ మీదుగా ఘట్‌కేసర్‌లోని ఎన్ఎఫ్‌సీ నగర్ వరకు జనసందోహం నడుమ అందె శ్రీ అంతిమయాత్ర కొనసాగింది.అందె శ్రీ అంతియ యాత్రలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, జూపల్లి కృష్ణారావు, అభిమానులు, సాహితీ ప్రియులు వేలాది సంఖ్యలో తరలివచ్చారు. 500 మంది కళాకారులు యాత్ర సాగుతున్నంతసేపు ఆడిపాడారు. అమర్ రహే అందె శ్రీ అంటూ కడసారి కన్నీటి వీడ్కోలు పలికారు. అభిమానుల ఆశ్రునయనాల నడుమ అంత్యక్రియలు ముగిశాయి.




ఘట్‌కేసర్: ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ అంత్యక్రియలు పూర్తయ్యాయి. ఘట్‌కేసర్‌లో నిర్వహించిన అంతిమ సంస్కారాలకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

అందెశ్రీ పాడెను సీఎం రేవంత్ మోశారు. తెలంగాణ ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**అందెశ్రీ కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం: సీఎం రేవంత్**... అందెశ్రీ మరణం వ్యక్తిగతంగా తనకు, తెలంగాణ సమాజానికి తీరని లోటు అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గతంలో రాష్ట్రం గురించి అనేక విషయాలు ఆయనతో చర్చించినట్లు తెలిపారు. జయ జయహే తెలంగాణను రాష్ట్ర గీతంగా నిర్ణయించిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తుచేశారు. అందెశ్రీ అంత్యక్రియల అనంతరం ఘట్‌కేసర్‌లో రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. "అందెశ్రీ ప్రతి మాట ప్రజా జీవితంలో నుంచి పుట్టుకొచ్చింది..

ప్రతి పాట తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని నింపింది. జయ జయహే తెలంగాణ గీతాన్ని పాఠ్య పుస్తకాల్లో చేరుస్తాం. అందెశ్రీ కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తాం. తన జీవితాన్ని ప్రజల కోసం త్యాగం చేసిన మహనీయుడు ఆయన. ఆయన రచనలకు సంబంధించిన 'నిప్పులవాగు' పుస్తకాన్ని ప్రతి గ్రంథాలయంలో అందుబాటులో ఉంచుతాం." అని రేవంత్‌రెడ్డి తెలిపారు.




హైదరాబాద్, నవంబర్ 11: మొంథా తుఫాను కారణంగా నష్టపోయిన వరద బాధితుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వరద బాధిత కుటుంబాలకు రూ.12.99 కోట్లు తక్షణ సాయం అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం ఈరోజు (మంగళవారం) ఉత్తర్వులు జారీ చేసింది. మొంథా తుఫాను ప్రభావంతో ఇటీవల రాష్ట్రంలోని పలు జిల్లాలో భారీ వర్షాలు కురిసిన విషయం తెలసిందే. ఈ క్రమంలో వరదల్లో నష్టపోయిన కుటుంబాలకు తక్షణ సాయం అందిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షాలతో దెబ్బతిన్న ఇళ్ళకు రూ.15,000 చొప్పున సాయం అందిస్తూ రెవిన్యూ విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ ఉత్తర్వులు విడుదల చేశారు. జిల్లా కలెక్టర్లు పంపించిన నివేదికల ప్రకారం 15 జిల్లాల్లో 8662 ఇండ్లు దెబ్బతినగా.. వీరికి తక్షణ సాయంగా రూ.12.99 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులను నేరుగా బాధిత కుటుంబాల బ్యాంక్ ఖాతాలో జమ చేయనున్నారు. కాగా.. అక్టోబర్ 27 నుంచి 30 వరకు వరుసగా నాలుగు రోజులు రాష్ట్రంలోని 16 జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి.

వరంగల్, హన్మకొండ, వికారాబాద్, వనపర్తి, రంగారెడ్డి, కరీంనగర్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, యాదాద్రి భువనగిరి, సిద్ధిపేట, రాజన్న సిరిసిల్ల, ములుగు, మహబూబాబాద్, సూర్యాపేట, భద్రాద్రి కోతగూడెం, నల్గొండ జిల్లాలు భారీ వర్షాలకు తీవ్రంగా ప్రభావితమైన విషయం తెలిసిందే.




## హైవేపై ప్రమాదం.. మంటల్లో దగ్ధమైన ట్రావెల్స్ బస్సు..

హైదరాబాద్-విజయవాడ 65 వ జాతీయ రహదారిపై మరో ప్రమాదం సంభవించింది. విహారీ ట్రావెల్స్ బస్సు 40 మంది ప్రయాణికులతో బయలుదేరింది. చిట్యాల మండలం పిట్టంపల్లి దగ్గరకు చేరుకోగానే బస్సులో మంటలు చెలరేగాయి. దీంతో బస్సు డ్రైవర్ వెంటనే అప్రమత్తమయ్యారు. బస్సును రోడ్డు పక్కన ఆపి, వెంటనే ప్రయాణికులను అప్రమత్తం చేశాడు. దీంతో లోపల ఉన్న వారంతా వెంటనే బస్సు దిగిపోయారు.
ఈ ఘటనలో బస్సు మొత్తం పూర్తిగా కాలిపోయింది. డ్రైవర్ అప్రమత్తతో ప్రయాణికులంతా క్షేమంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న అగ్నిప్రమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేస్తున్నారు.




## జూబ్లీహిల్స్‌లో గెలుపు ఎవరిది?.. ఎగ్జిట్ పోల్స్ అంచనాలివే..

హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో సర్వత్రా ఆసక్తి నెలకొన్న జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నిక పోలింగ్ ముగిసింది. ఈనెల 14న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్‌లో గెలుపెవరిదనేదానిపై ఎగ్జిట్ పోల్స్ అంచనాలు ఇలా ఉన్నాయి. చాణక్య స్ట్రాటజీస్ .. కాంగ్రెస్‌కు 46శాతం, భారత రాష్ట్ర సమితికి 43 శాతం, BJP 6 శాతం ఓట్లు వస్తాయని అంచనా వేసింది. హెచ్ఎంఆర్ సర్వే.. కాంగ్రెస్‌కు 48.3శాతం, భారత రాష్ట్ర సమితికి 43.18శాతం, భాజపాకు 5.84 శాతం ఓట్లు లభించే అవకాశముందని పేర్కొంది. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్(భారత రాష్ట్ర సమితి) మృతితో ఉప ఎన్నిక నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. 58 మంది అభ్యర్థులు బరిలో ఉన్నా.. ముగ్గురి మధ్యే ప్రధాన పోటీ ఉంది. భారత రాష్ట్ర సమితి తరఫున మాగంటి గోపీనాథ్ భార్య సునీత, కాంగ్రెస్ పక్షాన నవీన్ యాదవ్, భాజపా తరఫున లంకల దీపక్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. గెలుపుపై ఎవరికి వారు ధీమాగా ఉన్నారు. ఎన్నికను అధికార పార్టీ, ప్రతిపక్షాలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. నియోజకవర్గంలోని రాజకీయ పరిణామాలు, ఓటర్లు ఇచ్చే తీర్పుపై రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఆసక్తి నెలకొంది.




## ఉగ్రవాది మొయినుద్దీన్ విచారణలో.. సంచలన విషయాలు!

హైదరాబాద్: అరెస్టైన ఉగ్రవాది డాక్టర్ మొయినుద్దీన్ విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. గుజరాత్ ఏటీఎస్ బృందం రాజేంద్రనగర్ ప్రాంతంలో సయ్యద్ మొయినుద్దీన్‌ను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. విచారణలో కీలక సమాచారం బయటకు వచ్చినట్టు తెలుస్తోంది.

సమాచారం ప్రకారం, మొయినుద్దీన్ భారీ స్థాయిలో విషప్రయోగం చేసి చంపాలని కుట్ర పన్నినట్లు వెల్లడైంది. అతను రెసిన్ అనే ప్రాణాంతక రసాయనాన్ని తయారు చేస్తున్నాడని పోలీసులు తెలిపారు. ఈ విషాన్ని దేవాలయాల నీటి ట్యాంకుల్లో, పబ్లిక్ వాటర్ ట్యాంక్‌లో కలిపి పెద్ద ఎత్తున ప్రజలను చంపాలని కుట్ర పన్నినట్లు తెలుస్తోంది. మొయినుద్దీన్ నుంచి రెసిన్ తయారీలో ఉపయోగించే పలు రసాయన పదార్థాలను గుజరాత్ ఏటీఎస్ స్వాధీనం చేసుకుంది. మొయినుద్దీన్ పాకిస్తాన్ నుంచి వచ్చిన హ్యాండ్లర్ ఆదేశాల మేరకు ఈ విషాన్ని తయారు చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది.

దానికి సంబంధించిన డిజిటల్ ఆధారాలు కూడా లభించినట్టు అధికారులు తెలిపారు. సయ్యద్ మొయినుద్దీన్ చైనాలో MBBS పూర్తి చేసి హైదరాబాద్‌కు తిరిగి వచ్చి, ఆన్‌లైన్ ట్రీట్‌మెంట్ పేరుతో వైద్య సేవలు అందిస్తున్నాడు. అతనితో పాటు గుజరాత్ ఏటీఎస్ నలుగురిని అరెస్ట్ చేసింది. మొయినుద్దీన్ నుండి మరిన్ని వివరాలు తెలుసుకోవడానికి ప్రత్యేక బృందం విచారణ జరుపుతోంది.




దేశ రాజధాని దిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు ఘటన దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తును ముమ్మరం చేశారు. సీసీటీవీ దృశ్యాల ఆధారంగా ఫరీదాబాద్ ఉగ్ర కుట్రతో సంబంధాలు ఉన్న డా.ఉమర్ మహ్మద్ ఈ పేలుడులో కీలక వ్యక్తి అని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి.

**ఎవరీ ఉమర్ మహ్మద్..?...** పుల్వామాకు చెందిన ఉమర్ 1989 ఫిబ్రవరిలో జన్మించాడు. అతడి తండ్రి జీహెచ్ నబీ భట్, తల్లి షమీమా బానో. ఉమర్ తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసి.. దాదాపు 10 ఏళ్ల క్రితం ఉద్యోగం నుంచి వైదొలిగారు. శ్రీనగర్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఉమర్ ఎంబీబీఎస్, ఎండీ (మెడిసన్) పూర్తి చేశాడు. కొన్నాళ్లు.. జీఎంసీ అనంతనాగ్‌లో సీనియర్ రెసిడెంట్‌గా ఉన్నాడు. అనంతరం ఫరీదాబాద్‌లోని అల్ ఫలాహ్ వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశాడు. సోషల్ మీడియా వేదికగా తీవ్రవాద భావజాలానికి గురైన డాక్టర్లలో ఉమర్ కూడా ఒకడు. ఇటీవల జమ్మూకశ్మీర్‌లో నిర్వహించిన ఉగ్రవాద ఆపరేషన్‌లో పలువురు డాక్టర్లను భద్రతాధికారులు అరెస్టు చేశారు. వారితో ఉమర్‌కు కూడా సంబంధాలు ఉన్నాయని అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. అరెస్టయిన డా.అదిల్‌కు ఉమర్ సన్నిహితుడు అని, గతంలో వీరిద్దరూ అనంత్‌నాగ్‌లో కలిసి పనిచేసినట్లు కనుగొన్నారు. వారి అరెస్టు నేపథ్యంలో భయాందోళనకు గురైన ఉమర్.. ఈ పేలుడుకు పాల్పడినట్లు నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి.

**పోలీసుల అదుపులో ఉమర్ కుటుంబసభ్యులు..** ఇక, తాజా పేలుడు నేపథ్యంలో ఉమర్ కుటుంబసభ్యులను పోలీసు అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అతడి సోదరులు జహూర్, ఆషిక్ నబీలను కూడా అరెస్టు చేసి విచారిస్తున్నట్లు సమాచారం. శుక్రవారం ఉమర్ తన తల్లికి ఫోన్ చేసి.. లైబ్రరీలో చదువుకోవడంలో బిజీగా ఉన్నందున తనకు ఫోన్ చేయొద్దని పేర్కొన్నట్లు తెలిసింది. ఈ క్రమంలో తన ఫోన్‌ను కూడా స్విచ్ ఆఫ్ చేశాడు. పేలుడుకు కారణమైన కారులో ఓ వ్యక్తి శరీర భాగాలను అధికారులు గుర్తించారు.

ఇవి ఉమర్‌వా, కావా అని తెలుసుకునేందుకు అతడి కుటుంసభ్యుల నుంచి డీఎన్ఏ నమూనాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. దిల్లీ పేలుడులో ఉమర్‌తో పాటు మరో ముగ్గురు వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. వారు తారిఖ్ అహ్మద్ మాలిక్, ఆమిర్ రషీద్, ఉమర్ రషీద్‌గా గుర్తించారు.




## పసిడి ప్రియులకు షాక్.. భారీగా పెరిగిన బంగారం ధరలు..

**కొన్ని రోజులుగా స్థిరంగా కొనసాగుతున్న బంగారం ధర రెండ్రోజులుగా పెరుగుతూ వస్తోంది. ఈ రోజు (నవంబర్ 11) ఉదయం 10 గంటల తర్వాత బంగారం ధర భారీగా పెరిగింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1, 26, 280కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే దాదాపు రూ. 2460 పెరిగింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 1, 15, 750కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే దాదాపు రూ. 2250 పెరిగింది. ఇటీవల ధర బాగా తగ్గడంతో కొనుగోళ్లు పెరగడమే ఈ పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఇక, ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 26, 430కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 1, 15, 900కి చేరుకుంది. ఇక వెండి ధరల్లో కూడా భారీ పెరుగుదల నమోదైంది. కేజీకి 3000 రూపాయల మేర వెండి ధర పెరిగింది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ. 1,70,000 గా ఉంది. ఇక, ఢిల్లీలో కిలో వెండి ధర రూ.1,60,000గా ఉంది.**

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com